మానేపల్లి సత్యనారాయణ

# శ్రీరంగం నారాయణబాబు

## 1

తెలుగు వచనా కవితా పరిణామక్రమంలో శ్రీరంగం నారాయణబాబు అతి ప్రధానమైనవాడు. శ్రీశ్రీ అత్యంత ప్రధానమైనవాడు శ్రీశ్రీ, నారాయణబాబు, పఠాభి – శిష్లా వీరు తెలుగు వచన కవితకు మూలపురుషులు.

భావకవులు ప్రాచీన ఛందాలలోనేగాక–మాత్రాఛందాలలో కూడా గీతాలల్లాడు. పాతకాలంనాటి కవిసమయాలనూ వర్ణనారీతులనూ వదిలి పాశ్చాత్య సాహిత్యప్రభావజనితమైన సరికొత్త పదజాలాన్ని సృష్టించుకున్నారు. దేవులపల్లికృష్ణశాస్త్రి రాయప్రోలు సుబ్బారావు, వేదుల సత్యనారాయణశాస్త్రి వగైరాదు లెందరెందరో ఈ కోవలో రచనలుసాగించి తెనుగు దేశంలో కొత్తగాలినీ, సరికొత్త పరిమళాల్ని ప్రసరింపజేశారు. శ్రీశ్రీ, నారాయణబాబు ప్రభృతులు ఈ విధానాన్ని మెచ్చలేదు. భావకవితను త్రోసి రాజన్నారు. చంపకమాల, ఉత్పలమాలాదుల్ని విడిచినా ఛందస్సును విడువని కారణం చేతా – ప్రేయసీ, వెన్నెలా, చుక్కలూ, చంద్రుడూ, ప్రకృతి సౌందర్యమూ ఇత్యాదుల్ని గురించి తప్ప సమాజానికి ఉపకరించేది ఏదీ వ్రాయని కారణంచేతా వీరు భావికవితను ఆమోదించలేదు. అయితే వీరు సైతం తొలినాళ్ళల్లో ఎంతో కొంత మేరకయినా ఛందస్సులలో భావకవితలు రచించకపోలేదు. శ్రీశ్రీ "ప్రభవ" పేర భావకవితల్ని సంకలనంగా వెలువరించాడు. నారాయణబాబుకు భావకవితపై ఎన్నడూ అయిష్టమే. కొన్ని భావకవితలు ప్రచురించేసరికే దానిపై ఏవగింపుకలిగి ఆమార్గాన్ని శాశ్వతంగా విడిచిపెట్టాడు. తదనంతరం భావకవిత్వంపై ధ్వజం ఎత్తాడు.

ఈ పరిణామక్రమాన్ని ఆచార్య రోణంకి అప్పలస్వామి గారు[1] ఇలా వివరిస్తున్నారు :

"తెలుగు సాహిత్యంలో నవ్యకవిత వ్యావహారికవాది గురజాడ. అభ్యుదయ కాముక ముత్యాల సరాలతోను, భావకవుల నూతన పోకడలతోను మొదలిడిందని చెప్పవలసిన అవసరం లేదనుకుంటాను. భావకవుల కవిత నూటికి తొంభైపాళ్ళు ఆత్మాశ్రయం. కృష్ణశాస్త్రి పల్లకీ, ఆమె పాటలాంటి శీర్షికలలోను, విశ్వనాథ కన్నెకాటుకకళ్ళు, రైలులోబిచ్చగాడు అన్న ఖండికలలోను, కవికొండల శివరాత్రి ప్రభలోను వారనుకోకుండా ఫ్రెన్సులో పందొమ్మిదవ శతాబ్దాంతంలో పరిణతినందిన ప్రతీకవాదాత్మక [Symbolist] కవిత్వస్థాయివుందన్నామనడం ఏమాత్రం అతిశయోక్తి కానేరదు. ఆనాడు యువతరానికి చెందిన నారాయణబాబు, శ్రీశ్రీ భావకవిత్వంతో ప్రారంభించి ఏతద్ధోరణికి ముప్పైలలో తిలోదకాలిచ్చి నూతన శకాన్ని ప్రవేశపెట్టారు.

ఈ నవ్య ధోరణికి శ్రీశ్రీ ఆద్యుడని కొందరి అభిప్రాయం. నారాయణబాబని కొందరివాదన. ఇద్దరు ఒకే సంధి సమయంలో ఒక్కుమ్మడినా క్రొత్త దారి తొక్కారన్నది చారిత్రిక సత్యం. పందొమ్మిదివందల ముప్ఫయిఎనిమిదిలోనని జ్ఞాపకం పఠాభి, శ్రీశ్రీ ఇంట్రోతో ఫిడేలురాగాలడజన్ అన్న సంపుటిని వెలువరించి నిక్కచ్చిగా వచన కవితకు సాహసించాడు తన వచన పద్యాల దుడ్డుగట్టలతో ఛాందసులనడుములు విరగగొడతానని, తాను భావకవిన్మాత్రంగా నహంభావ కవినని పాంచజన్యాన్ని పూరించాడు. ఈ సందర్భంలో ఉదయించిన వచన కవితకు మూలపురుషుడు – లేక మూలపురుషులెవరనే ప్రశ్నకు సమాధానం చెప్పడం అనవసరం.

.... .... ....

రెండవ ప్రపంచ సంగ్రామానికి ముందురోజులలో శ్రీశ్రీ, నారాయణబాబులు ఆనాటి అశాంతి, ప్రజాహిత స్వరాజ్యకాంక్షను పురస్కరించుకొని భావవిప్లవాన్ని చేపట్టి అధిక సంఖ్యాక ప్రజారంజకంగా గేయాలను అల్లిపెట్టారు"

ఈవిధంగా శ్రీశ్రీ. నారాయణబాబు, పఠాభిగార్ల అవతరణ తెలుగు కవితారంగంలో ఒక చారిత్రాత్మకమైన మలుపును సృష్టించింది

నారాయణబాబుకు శ్రీశ్రీకి వచ్చినంత ప్రచారంరాలేదు, ఇందుకు కారణం రోణంకివారే ఇలా వివరిస్తున్నారు :

"[రెండవ] సంగ్రామ కాలంలో కమ్యూనిస్టు పార్టీవారు సమావేశాలలో ఊరేగింపులలో గురజాడ శ్రీశ్రీ ప్రణీతగేయాలను ఆవేశపూరితకంఠాలతో పాడడంతో వీరిద్దరి యుగపురుషత్వం బయటపడి అభ్యుదయవాదపు పోకడలు సాహిత్యరంగంలో మిన్నుముట్టాయి. నారాయణబాబుకు అట్టిచేయూతనిచ్చినవారు లేకపోయారు"

ఇప్పుడిక నారాయణబాబు జీవితంగురించీ, రచనల గురించీ విపులంగా వివరిస్తాను.

## 2

నారాయణబాబుగురించి తలుచుకుంటే నామనసంతా విషాదంతో నిండిపోతుంది. నేను అతన్ని ఒక్కసారికూడా సజీవంగా చూసి వుండలేదు.

1960–63 ప్రాంతాల్లో విజయనగరంలో చదువుకుంటున్న రోజుల్లో నేను మొదటిసారి నారాయణబాబు గురించివిన్నాను. ఆచార్యులు రోణంకివారూ, ప్రఖ్యాత కథకులు చాసో, చిత్రకారులు పైడిరాజుగారూ, గురజాడ అప్పారావుగారి అబ్బాయి గురజాడ రామదాసుగారూ, ఢిల్లీశర్మగా పేంపిలిచే చిర్రాపూరి సర్వేశ్వరశర్మగారూ అప్పుడప్పుడు నారాయణబాబు గురించి చెబుతూంటే వినేవాడిని. ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ఎర్ర బుష్‌షర్ట్ అనే కథ డి. ఆర్. బొమ్మతో అచ్చుపడటంచూశాను. ఆ తరువాత కొద్ది రోజుల్లోనే నారాయణబాబు మరణవార్తను ఆంధ్ర పత్రిక ప్రకటించింది. ఆప్తమిత్రుడి మరణానికి దుఃఖిస్తూ అల్విదా, అల్విదా అంటూ ఆరుద్ర రాసిన గీతంకూడా

ఆంధ్రపత్రికలోనే ప్రచురితమైంది. ఆ తరువాత కొంతకాలానికి రోణంకి వారింట్లో అశ్రద్ధగా ఒకమూలపడివున్న **inland letter** దొరికింది. అందులో ఆరుద్ర, **నారాయణబాబు** మరణవార్తను రోణంకివారికి తెలియచేశాడు.

ఆ పుత్తరం యథాతథంగా ఇదీ :

మద్రాసు,
Dear Appalaswamy Garu, 2–10–61

ఈరోజు పొద్దుట గం॥ 7–30 లకు రాయపేట ఆస్పత్రిలో నారాయణబాబు చనిపోయాడు. నేను, శ్రీశ్రీ, పూసపాటి కృష్ణంరాజు దగ్గరుండి దహనం జరిపించాం. ఈ విషాదవార్త అక్కడి స్నేహితులకు తెలియజేయండి. – ఆరుద్ర

నారాయణబాబు రచనలు చదవాలనే అభిలాష నాలో 1963 తరవాతనే పెరిగింది. మిత్రులు ఢిల్లీశర్మ గారింట్లో పాత తెలుగు స్వతంత్ర, నవత, ఢంకా, రూపవాణి, ఆనందవాణి వంటి పత్రికల్లో నారాయణబాబు రచనలు చదివాను "సంపెంగ తోట'' పై శ్రీశ్రీ, నారాయణబాబుల ఉత్తర ప్రత్యుత్తరాలు చూశాను. నీలంరాజు వెంకటశేషయ్యగారి ఆధ్వర్యంలో వెలువడిన "నవోదయ' మాసపత్రికలో "సంపెంగతోట" (నాటకం – చెహోవ్ రచనకు తెలుగు అనుసరణ) నారాయణబాబు రచనగా అచ్చయిందట. కాని అది ఆతరువాత శ్రీశ్రీ రచనగా పుస్తకరూపంలో అచ్చయింది. ఈ తగవు అప్పట్లో నాకు అయోమయంగా ఉండేది. ఆ తరువాత క్రమంగా సంగతి యావత్తూ బోధపడింది.

నారాయణబాబు రచనలన్నీ పుస్తకరూపంలో వస్తే చూడాలని నాకెంతో కోరికగా వుండేది. శ్రీశ్రీ షష్టిపూర్తి సందర్భంలో శ్రీశ్రీకి, ఆరుద్రకి వచ్చిన తీవ్ర విభేదాలవల్ల "రుధిరజ్యోతి'' పుస్తకరూపంలో అచ్చువెయ్యడానికి ఆరుద్ర ప్రయత్నించాడు. అప్పటికే నేను నారాయణబాబు కవితలను పాత పత్రికలలోంచి ఎత్తిరాసుకుని – ఎవరయినా "రుధిర జ్యోతి'' అచ్చువేస్తే వారికి నేను తప్పక సహకరించగలనని మిత్రులు సోమసుందర్ ప్రభృతులతో అంటూ **వుండేవాడిని.** ఆరుద్ర వెంటనే నాకు ఉత్తరం రాశాడు నేనుమరింత **శ్రమ** తీసుకుని అనకాపల్లి, నరసరావుపేటలలోని గ్రంథాలయా**ల్లో** పాత పత్రికలు తవ్వి నారాయణబాబు కవితలన్నీ **ఎత్తిరాసి** మద్రాసు తీసుకువెళ్ళి ఆరుద్రకు అందజేశాను. ఆరుద్ర పొరబాటో, ప్రచురణకర్తల పొరబాటో తెలియదుగాని, నేనిచ్చిన వాటిల్లో ఒక కవిత "రుధిరజ్యోతి''లో చేరలేదు. అంతవరకూ నారాయణబాబుపై వచ్చిన విమర్శ వ్యాసాల్లోని ముఖ్యాంశాలను అనుబంధంలో చెప్పాలని, నారాయణబాబు సంక్షిప్త జీవితచరిత్రనుకూడాచేర్చి "రుధిరజ్యోతి''ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని సంకల్పించాడు. సంక్షిప్త జీవిత చరిత్ర తయారుచెయ్యమనికూడా నాకు పెత్తాయించాడు. కాని ఇవేవీ లేకుండా రోణంకివారు నారాయణబాబుపై 1954 భారతిలో రాసిన **వ్యాసం**తో, సంఘప్షణకు నారాయణబాబురాసిన ప్రవరలోని కొన్ని వాక్యాలతో ఒకటి రెండు అనుబంధాంశాలతో రుధిరజ్యోతి 1972 లో మొదటిసారి అచ్చయింది [నవోదయ ప్రచురణ] ఈమధ్యనే 1977లో రెండవ ముద్రణకూడా వెలువడింది. [ఏమార్పులూ, చేర్పులూ లేకుండానే] విద్యార్థిదశలో విజయనగరంలో నారాయణబాబుగురించి ఆచార్య రోణంకి **ప్రభృతులు** చెప్పారు. పెద్దవాణ్ణయ్యాక పురిపండా అప్పల **స్వామిగారిద్వారా** నారాయణబాబుగురించి చాలా ఎక్కువ **విషయాలు విన్నాను**. ఆయన నారాయణబాబుగురించి ఒక **వ్యాసం** [3] ప్రచురించారు. అందులోంచి కొన్ని పేరాలు ఉదహరిస్తే అతనిగురించి మనకు చాలా సంగతులు తెలుస్తాయి.

నారాయణబాబును తల్చుకుంటే నాకేకాదు ఆయనకు కూడా చాలా బాధగా వుంటుందట.

"బతుకుతెరువు తెలియనివాడు నారాయణబాబు. గడన చేతకానివాడు, ఇంచుమించు నాలాగే

చచ్చిపోయాడు పాపం ! నేను విన్నదాన్నిబట్టి తిండికి రొక్కటపడి చచ్చిపోయాడు. రోగం మళ్ళించుకుందికి మందు లేక చచ్చిపోయాడు. రక్తం కక్కుకుంటూ చచ్చిపోయాడు. తల్చుకుంటే ఇప్పటికీ బాధగానే వుంటుంది"

ఇంకా ఇలా రాస్తున్నారు పురిపండా వారు :

"నారాయణబాబు బాల్యం విజయనగరంలో గడిచింది తండ్రి శ్రీరంగం వెంకటసుందరనారాయణగారు వకీలు. తల్లి రమణమ్మ, అన్న అప్పడువర్తులు, మున్సిపాల్టీలో ఉద్యోగి.

కవి నారాయణబాబు తాతా, మహాకవి శ్రీశ్రీ తాతా సహోదరులు. శ్రీశ్రీ తాత శ్రీరంగం సూర్యనారాయణగారూ, నారాయణబాబు తాత శ్రీరంగం సుందరయ్యగారూ అన్నదమ్ములు. ఒక్క తల్లి బిడ్డలు. వీరిద్దరికీ సంతానంలేకపోయింది. సూర్యనారాయణగారు పూడిపెద్దివారి అబ్బాయిని వెంకట సోమయాజులును దత్తత చేసుకుని వెంకటరమణయ్య అని పేరుపెట్టుకున్నారు. సుందరరామయ్యగారు ఆతివారిఅబ్బాయిని వెంకటసుందరనారాయణను పెంచుకున్నారు. పేరు మార్చలేదు వెంకటరమణయ్యగారి కుమారుడు శ్రీరంగం శ్రీనివాసరావు – అదే శ్రీశ్రీ. వెంకటసుందరనారాయణగారి రెండో కుమారుడు నారాయణబాబు ఈ విధంగా నారాయణబాబూ, **శ్రీశ్రీ** అన్నదమ్ములు.

**నారాయణబాబు** చదువు స్కూలుఫయినలు దాటలేదు. **చిన్నప్పటినుంచీ** పద్యాలూ,పాటలూ, నాటకాలుఅంటే సరదా. **ఆ దినాల్లో విజ**యనగరం కొట్లమాదప్పవీధిలో ఒక నాటక **సమాజం వుండేది.** కోటయ్యనాయుడూ మొదలైనవారు దాన్ని నడిపేవారు. నారాయణబాబు ఆ సమాజంలో వేషాలు వేసేవాడు. గొంతుక శ్రావ్యంగా వుండేది కనక ముఖ్యంగా స్త్రీ పాత్రలు ధరించేవాడు. ఈ అభిజ్ఞతే అతన్ని సినిమాల్లోకూడా నటింపచేసింది.1935లో నేను కొన్నాళ్ళు కలకత్తాలో వున్నాను కబీరుదాసు సినిమాలో అభినయించడంకోసం. అప్పుడు కలకత్తాలో ఉన్నాడు నారాయణబాబు భోగమల్లు పాత్ర అభినయించాడు. ఆ ఫోటో పూడిపెద్ది వెంకటరమణయ్యగారి చిన్న వ్యాసంతో భారతిలో పడింది. కలకత్తాలో మేం ఇద్దరం తరచు కలుసుకునేవాళ్ళం సినిమా స్టూడియోకి వెళ్ళేవాళ్ళం. పార్కుల్లో కూచుని మన సాహిత్యంగురించీ సినిమాలగురించీ మాట్లాడుకునేవాళ్ళం. సరికొత్త బెంగాలీ కవిత్వం చదివి వినిపించేవాణ్ణి నేను.

బాల్యంలోనే కవిత్వంమీదా, గానంమీదా అభిరుచి అధికమైంది నారాయణబాబుకి. రచన తక్కువే అయినా ఉత్సాహం

హెచ్చుగా వుండేది. 1920 ప్రాంతంలో కాశూరి నరసింగరావు గారితో స్నేహం కలిసింది. కాశూరి ఛందస్సూ, కావ్యాలూ చదువుకున్న యువకుడు. పకడ్బందీగా పద్యాలు కట్టగలకవి. నేనెరిగినంతవరకు నారాయణబాబు ఛందస్సూ కావ్యాలూ, వ్యాకరణమూ, నిఘంటువూ ఒక క్రమపద్ధతిని అభ్యసించిన పాపాన పోలేదు. అందుకని తన భావావేశానికి తగినపదజాలం అందేది కాదతనికి తరచు. అదిచూసి అతడు మూగవాడు అనే వాడు కృష్ణశాస్త్రి. కాని తన కవిత్వానికి కావలసిన భాష తనకి సమృద్ధిగా వుంది. అంటారు బైరాగి.

కాశూరి సాంగత్యమే నారాయణబాబును కవిగా మలించింది [4] నారాయణబాబే అన్నాడు కాశూరిని "నన్ను వేణువుగా నూదు నా ప్రభుండు"అని. ఇంతకీ తనలోవుండిన ప్రతిభే తాను కవి కావటానికి ముఖ్య కారణం అనడమే సమంజసం.

కాశూరీ, చొప్పల్లి భాగవతారూ, నారాయణబాబూ తరచు విజయనగరం అయ్యకోనేటిగట్టుమీదా, ముదునూరి జోగారావు గారి భవంతిలోనూ ద్వారం వెంకటస్వామినాయుడుగారి బసలోనూ కలుసుకుని కవితా వ్యాసంగం చేసేవారు. సంగీత సాధన జరిపేవారు. ఆధునికాంధ్ర కవుల్లో వీరికి రాయప్రోలు, విశ్వనాధ, కృష్ణశాస్త్రి, వేదులా బాగా నచ్చేవారు. పూడిపెద్ది వెంకటరమణయ్యా వీరితో కలిసేవారు.

పూడిపెద్ది వెంకటరమణయ్య ఆధునిక భావాలుగల కవి. అప్పటికి కొన్ని ఖండకావ్యాలూ, గేయాలు రాశారు. కధకుడు కూడా .... ఈయన ప్రోత్సాహంకూడా నారాయణబాబుకి లభించింది. కాశూరీ, నారాయణబాబూ కలిసి కవిత్వం రాసిన దినాలూ వున్నాయి. ఇదే సూచిస్తూ కాశూరి తన 'లవలీదళాలు' కావ్య సంపుటిలో కవిద్వంద్వం అన్న ఖండికలో

మోహముల ముద్దవరు తొలి ముద్దతండు
లలన తడిబుగ్గ సిగ్గు గులాబి నేను
మదిని జల్లను సుఖమెల్ల మాదుకవిత – అన్నారు.

1926లో మా కవితా సమితి ఏర్పడింది. నారాయణబాబూ కాశూరీ, పూడిపెద్దీ కవితా సమితిలో సభ్యులయ్యారు. అప్పటినుంచీ మేమంతా అరమరికలులేని స్నేహితులం. మా అందరిలోకి శ్రీశ్రీ చిన్నవాడు, వయస్సులో అందరికీ ప్రేమపాత్రుడు.

కవితాసమితిలో చేరాకే నారాయణబాబు విరివిగా రచన సాగించినట్టు జ్ఞాపకం. విజయనగరం నుంచి తనూ, కాశూరీ, పూడిపెద్దీ తరచు విశాఖపట్నం వచ్చేవారు. వచ్చినప్పుడల్లా కొత్త రచనలు పట్టుకువచ్చేవారు. అప్పుడు మాయిల్లు కవి సమ్మేళనంలా వుండేది. కవితా వ్యాసంగంలోనే రాత్రిళ్ళు రాత్రిళ్ళు గడిచిపోయేవి. నారాయణబాబు తనకవితపాడేవాడు.

.... .... ....

పాశ్చాత్య సాహిత్యాల విప్లవాలూ కొత్త కొత్త ప్రక్రియలూ, సరికొత్త పుస్తకాలూతెచ్చి శ్రీ శ్రీ వినిపించేవాడు. నారాయణబాబుని చదవమని సలహా యిచ్చేవారు. అయితే శ్రీశ్రీలా వాటిని అతను అవగాహన చేసుకోలేకపోయేవాడనిపించేది. శ్రీశ్రీ కళాతపస్వి. నారాయణబాబుకళాపిపాసి. శ్రీశ్రీతో బాగా అనుబంధం అధికమయాక క్రమంగా నారాయణబాబు మారిపోయాడు. కాశూరి ప్రభావం అతడిమీంచి తప్పకుంది

నారాయణబాబు జీవితంకూడా అతని కవిత్వాన్ని మలిచింది. తండ్రిగారి ఆర్థిక స్థితిదిగజారిపోయింది. విజయనగరంలోని తమ "కరప్రమేడ" విక్రయించి భీమునిపట్నం మారారు. చేసే ఉద్యోగమూ కవిత్వ కట్టడం. కవిత్వం కడుపునింపదు.

నారాయణబాబు వైవాహిక జీవితం సుఖమయం కాలేదు. ఇంకో విదుషీమణిని ప్రేమించాడు. ఆమే ప్రేమించింది. బాల్య వితంతువామె.

"చూడలేని పాపిష్టి తుఫాను ఊడపీకె లతను
మోడైపోయి మామిడిచెట్టు మొహము వేలవేసె"

ప్రేమ పరిణయంగా పరిణమించకుండానే నూరేళ్ళు నిండేయామెకి. భగ్న హృదయంతో భావ గీతాలు ఆలాపించాడు నారాయణబాబు. ఈ విషయం తానే సభల్లోనూ చెప్పుకున్నాడు.

.... .... ....

శ్రీశ్రీ "మహా ప్రస్థానం గేయాలు" పూడిపెద్ది "అల్పిలూ సూదులు" నారాయణబాబు "రుధిరజ్యోతి" తురగా 'ఏడిరా భగవంతుడూ', నా 'పులిపంజా' గేయాలూ అప్పుడే ఆరంభం ఈ ఉద్యమంలో ఎవరు ముందనికాదుచూడవలసింది, ఎవరిది నాయకత్వం అని. నాయకత్వం శ్రీశ్రీదే అని కాలం తీర్పు చేసింది, ముందడుగూ అతందేనేమోకూడా. మొదటినుంచీ 'పదండి ముందుకు' అనే రకమే అతను.

వచన కవిత మాలో నేనే ముందు రాశానేమో అనుకుంటాను, 'వీణ'లోని గదబకన్యా, ఆంధ్రభూమిలోని హృదయదళనమూ, మూగసాక్ష్యాలూ. ముందే చెప్పాను. ముందు రాయడం ముఖ్యం కాదు, ముందుకు వెళ్ళడం ముఖ్యం.

శ్రీశ్రీ చెన్నపట్నం వెళ్ళిపోయాడు – నారాయణబాబూ ఆ పట్నం చేరుకున్నాడు. 1947లో నేను కొన్నాళ్ళు మద్రాసులో వున్నాను. అప్పుడు ఖాసింఖాను నైజాము లేజాన్ ఆఫీసర్‌గా వుండేవాడక్కడ. మా కవితాసమితి మద్రాసుశాఖ అప్పుడే స్థాపించాము, ముద్దా విశ్వనాథంగారి జయానికేతన్‌లో శ్రీశ్రీ నారాయణబాబూ మొదలైనవారు ఖాసింఖానుగారి భవనంలో తరచు సమావేశమయ్యేవారం"

.... .... ....

ఇప్పటికే పురిపండావారి వ్యాసంలోంచి సుదీర్ఘంగా ఉదహరించాను. ప్రస్తుతానికి అముఖ్యం అని తోచిన కొన్ని విషయాల్ని విడిచిపుచ్చాను. ఇక ఇప్పుడు ఇంతవరకూ చెప్పకోని కొన్ని విషయాలు మిత్రులవల్ల విన్నవి, విశ్వసనీయమైనవని రుజువు పరుచుకొన్నవి – మరికొన్నిటిని వివరిస్తాను.

నారాయణబాబు 17-5-1906 న విజయనగరంలో జన్మించాడు. నారాయణబాబు వ్యక్తిగత జీవితం చాలా అస్తవ్యస్తంగానే సాగింది – నాదీ అని ఒక స్థిరమైన యిల్లుగాని, భార్యగాని, ఉద్యోగంగాని అతనికిలేవు. అంచేత కనీస ఆర్థిక అవసరాలుగ్గాని, కుటుంబ సుఖశాంతులుగాని అతనికి చేకూరనే లేదనిచెప్పాలి.

నారాయణబాబు కొన్నాళ్ళు Veterinary Course చదివి మానేశాడు. [5]

ద్వారం వెంకటస్వామినాయుడుగారు అతన్ని కొన్నాళ్ళు ఆదరించారు. ఒక హోటేల్లో రోజూ ఉదయం టిఫిన్. కాఫీ యిచ్చేందుకూ ఆయన ఏర్పాటు చేశారట. భోజనం మిత్రుల యిళ్ళల్లో చేసేవాడు. గిరిజాల జుట్టూ. లాల్చీ, పైజమా అతని వేషం. బీడీకట్టా. టీనీళ్ళూ వుంటేచాలు రోజులతరబడి సాహిత్య హస్కు కొడుతూ తిరిగేసేవాడు. అయ్యకోనేరుగట్టుమీద గుంచీ దగ్గర కూచుంటూ వుండేవాడు. అనవసరమే అనిపించినా మరింకో వివరం. నారాయణబాబుకి కొత్తిమీరఅంటే చాలా యిష్టంట. దాన్నతను భోజన కస్తూరి అనేవాడని అతన్ని చాలా బాగా తెలిసిన కొత్తపల్లి వీరభద్రరావుగారు[6] చెబుతున్నారు. నారాయణబాబు వెంకటస్వామినాయుడిగారి వెంట సంగీత కచేరీల్లో తిరుగుతూవుండేవాడు. నాయుడిగారి కచేరీకి ముందు నారాయణబాబు ఆయావూళ్ళల్లో ఆయనగురించి ఉపన్యసించేవాడు. నాయుడిగారితో పరిచయంవల్ల అతనికి సంగీతంలో మంచి పరిజ్ఞానమేవుండేది. ఖంగునమోగే కంఠం మైకు లేకుండా దాదాపు రెండుమైళ్ళు వినిపించేదట.

కాకినాడలో 1945 లో నారాయణబాబుకు జరిగిన సన్మానం గురించి చాగంటి గోపాలకృష్ణమూర్తిగారు[7] నాతో చెప్పారు. దాన్ని దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు ఏర్పాటు చేశారట. ఆయన ఆసభకు అధ్యక్షతకూడా వహించారు. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు ఉపన్యసించారు. ఆ సన్మానంలో కాకినాడలోని P R కాలేజీ ఎదురుగా బ్రహ్మసమాజంలోజరిగింది. అతనికి సన్మానంచేసి నూటపదహార్లు చదివించారు. ఆసభలో నారాయణబాబు surrealism గురించి మాట్లాడాడు. పురిపండావారు మరొక్క ముఖ్య విషయంకూడా చెబుతున్నారు.

ముద్దుకృష్ణ "వైతాళికులు"సంకలనంచేస్తున్న రోజుల్లో విశాఖపట్టణం వచ్చాడు. అతనంటే నారాయణబాబుకు ఏకారణము చేతనో కిట్టేదికాదు. అందుచేతనే "వైతాళికులు" సంకలనానికి తాను తన రచననివ్వకపోవడమేకాక మిత్రులెవ్వరినీ కూడా యివ్వవద్దన్నాడట. ఆ విధంగా ఎంతో గొప్ప సంకలనంగా ప్రసిద్ధిపొందిన వైతాళికులులో – ఆధునిక తెలుగు కవితలో, అతిముఖ్యమైన శ్రీరంగం నారాయణబాబు. కాళూరి నరసింగరావు, పూడిపెద్ది వెంకటరమణయ్య, పురిపండా అప్పలస్వామి, తురగా వెంకటరామయ్యగార్ల కవితలులేవు. ఈసంగతి అనేకమంది గుర్తించలేదు.

విజయనగరంనుంచి The Advertiser అనేపత్రిక కొన్నాళ్ళు నడిచింది. ఈ పత్రిక నేను విజయనగరంలో చదువుకుంటున్న రోజుల్లో కూడా వుండేది, దేవీ మిఠాయి దుకాణానికి ఎదురుగావుండే వేదవ్యాస ప్రెస్‌లో అచ్చయ్యేది. దీనికి కరిడేహాలు నాగేశ్వరరావుగారుసంపాదకుడు. [కొన్నాళ్లు నాగేశ్వరరావు తండ్రిగారు సంపాదకుడుగా ఉండేవాడు] ఈ పత్రికలో నారాయణబాబురాసిన ఇంగ్లీషు పద్యాలు 15 వరకూ అచ్చయ్యాయని చాగంటి సోమయాజులుగారుచెబుతున్నారు. [ఈ పత్రికలో ఇంగ్లీషు. తెలుగూకూడా అచ్చువేసేవారు. 1/4 డెమ్మీ సైజులో వుండేది.1964 ప్రాంతాల్లో ఆగిపోయింది పత్రిక]. నారాయణబాబు తన కవితల్ని చదివే విధానం అనన్య సామాన్యం, అనితరసాధ్యం అత్యంత మధురాతి మధురంగా వుండేదని నాతో నారాయణబాబును తెలిసినవారందరూ ముక్తకంఠంతో చెబుతున్నారు. అనేక పర్యాయాలు నారాయణబాబు తన కవితచదవగావిన్న రోణంకివారు ఆ అనుభూతిని నేనెరిగిన నారాయణబాబు[8] అనే వ్యాసంలో ఇలా వివరిస్తున్నారు :

"సోమయాజులు. "నారాయణబాబు ఒక స్వీయ కవిత ఆలాపిస్తాడు. జాగ్రత్తగా విను"మన్నాడు. ఆ కవిత పేరు దేశమాత. నేనింతకుముందు ఎప్పుడూవినని రాగంతో ఆకవిత చదివాడు. మళ్ళీ చదివించి సోమయాజులుచేత రాయించి తీసుకుపోయాను. అప్పటికి యిప్పటికీ నన్నాకవిత ఆవేశపూరితుణ్ణి చేస్తుంది. అయితే ఆ కవిత నారాయణబాబు చదివితే కళ్ళవెంట నీళ్ళు జలజల రాలితీరతాయి, నాయుడుగారు, భావనారాయణరావు, దుర్గాప్రసాదరావు ఆరాగం చాలా మంచి రాగం అని అనేకసార్లు చెప్పారు. ఆరాగంపేరు చెప్పారుకాని నాకు యిప్పుడు జ్ఞప్తికి రావడంలేదు. నారాయణబాబుకు ఆరాగం చాలా బాగానచ్చేదని వారందరి అభిప్రాయం. కొన్ని సంవత్సరాల తర్వాత నారాయణబాబుకి టెక్కలిలో సన్మానం చేశారు, ఆవేళ స్వామిసీతారామ్‌గారు అక్కడికి విచ్చేశారు – ఆయనని చూడడానికి చుట్టుపక్కల పల్లెటూళ్ళనుంచి తండోపతండాలుగా ప్రజానీకం వచ్చింది. స్వామీసీతారామ్ సమావేశం ఆయిన తర్వాత మా సమావేశం మొదలయింది. వచ్చినవారంతా అక్కడనేవుండి నారాయణబాబు ఉపన్యాసం విన్నారు. అతను దేశమాత, గడ్డిపరక అన్న రెండు స్వీయకవితలు ఆవేశపూరితుడై అలాపించాడు. కంట తడిపెట్టని శ్రోతలేడు అని అంటే నమ్మండి —

— అప్పుడప్పుడు శ్రీశ్రీ వచ్చేవాడు స్వీయకవితలను శ్రీశ్రీ వల్లిస్తూఉంటే నేను విస్తుపోయేనాన్ని. కవితలను ఆలాపించడంలో శ్రీశ్రీ నారాయణబాబువలె గడసరికాడు"

ఇదే విషయాన్ని "నవ్యాంధ్ర సాహిత్యంలో గవేషణ" అనే మరో వ్యాసంలోకూడా రోణంకివారు రాశారు.

ఎవడినైనా పొగడవలసివస్తే (డైరుకొట్టడం) నారాయణబాబు చాలా బాగా పొగిడేవాడట. అతనికి తెలియకుండానూ, తెలిసినా ఎబ్బెట్టుగా లేకుండానూ పొగిడేవాడట. అలాగే తిట్టవలసివస్తే – ఎవరైనాసరే – పడతిట్టిపోసేవాడట.

నారాయణబాబంటే భారతి సంపాదకుడు శివలెంకశంభుప్రసాద్‌గారబ్బాయి రాధాకృష్ణగారికి చాలా యిష్టంఅట. ఈ విషయాన్ని విశదపరిచే సంఘటన నొకదాన్ని రోణంకివారు నాతో చెప్పారు.

నారాయణబాబు వ్యక్తిత్వాన్ని చాటేటట్లు – అత్యంత ప్రతిభావంతంగా అంట్యాకుల పైడిరాజుగారు[9] చిత్రించిన తైలవర్ణచిత్రాన్ని అనేకసార్లుచూసి సజీవంగా నారాయణబాబును చూస్తున్నట్టే అనుభూతి పొందాను. అతని చివరిదశలో–నేను విజయనగరంలో చదువుకుంటూవుండేవాణ్ణని చెప్పానుకదూ - ఒక్కసారికూడా అతన్ని సజీవంగా చూడలేని దురదృష్టానికి నేనెంతగానో బాధపడుతూ వుంటాను. అయినా సజీవంగా చూసినఅనేకమందికంటే అతనిరూపు నామనసులోనిలిచివుంది.

# 3

నారాయణబాబు అనేక ప్రక్రియల్లో రచనలు చేశాడు. కవిగా ప్రసిద్ధుడైనా కథలు, నాటికలు, వ్యాసాలుకూడా రాశాడు.

కొద్దికాలంలో చనిపోతాడనగా ఆంధ్ర సచిత్ర వార పత్రికలో "ఎర్రబుష్‌షర్టు" అనే కథ అచ్చయిందని మొదటే చెప్పాను. ఆనందవాణిలో (బహుశా 1948 ప్రాంతాలలో) "చెన్నపట్నంలో చెట్లమీద కాపురం" అన్న కథొకటి పడ్డాది. ఈ కథ నేను చదివాను. ఇది కబుర్లుగా సాగి కథరూపంలోకి మలచబడింది. తానూ మిత్రులూ మద్రాసులో శాస్త్రిగారింట భోజనాలుచేస్తూ, పార్కు బెంచీలమీద, పెద్ద పెద్ద మర్రిచెట్టు కొమ్మలమీదా పడుకుని ఎలా గడిపేసేవాడో చెప్పాడు. అతను నాగయ్య ప్రేమించిన మనిషి, భానుమతి నీళ్ళాడిందంటే నేన్నమ్మను – అనేక కథలు ప్రచురించాడని చాసో అంటున్నారు. ఇవి నాకింతవరకూ లభ్యంకాలేదు. కథలగురించి చాసో మరొక భోగట్టాకూడా యిటీవల చెప్పారు నారాయణబాబూ చాసో కలిసి మద్రాసులో మైలాపూర్‌లో నెం. 7 కెనడీ స్ట్రీటులో ఒక చిన్న గదిలో వుండేవారట. పగలంతా అక్కడా అక్కడా తిరిగి సాయింత్రానికి గదికి చేరి చెరో మంచంమీదా పడుకునేవారట-గదిముందు ఆరుబయట దీపాలులేవు. జేబులో డబ్బుల్లేవు. డబ్బుకోసం రూపవాణికి కథలు రాద్దామని యిద్దరూ నిశ్చయించుకున్నారు. రెండణాల కొవ్వొత్తి కొంటే మూడుగంటలు వెలిగేది అది ఆరిపోయేలోగా చెరో కథా రాయాలనుకుని, కొవ్వొత్తి తెచ్చి ఇద్దరూ రెండుకథలురాశారు. తెల్లవారిలేచి రూపవాణి ఆఫీసుకువెళ్ళి కథలిచ్చి చెరో పది రూపాయలూ తెచ్చుకున్నారు. ఆ కథల పేర్లు చాసో స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. కొవ్వొత్తి అనే అయివుండొచ్చునంటున్నారు. ఇది బహుశా 1948 కి ముందు జరిగిన సంఘటనే సినిమా సన్యాసి నిర్యాణం – అనే కథకూడా రాశాడని అది రూపవాణిలోనో, ఢంకాలోనో పడిందనీ చెప్తున్నారు చాసో.

విజయనగరంలోని మరోమిత్రులు బెహరా సత్యనారాయణగారు రూపవాణిలో నారాయణబాబు ప్రచురించిన "అఖిలాంధ్ర దొంగల మహాసభ" అనే కథ చదివినట్టు చెబుతున్నారు. ఆ పత్రిక చాలాకాలం దాచారట గాని ప్రస్తుతం లేదు. నాకూ దొరకలేదు. విశాఖపట్నం సమీపంలో ఒక సభ జరుపుదామని నిర్ణయించుకుని – అక్కడికి వెళ్ళేవాళ్ళందరూ టిక్కెట్టు కొనకుండా రైళ్ళో ప్రయాణం చెయ్యాలని బయల్దేరారట, చివరికి సభకు చేరుకుంటారు. సభకూడా జరుగుతుంది ఇదే అందులోని ఇతివృత్తం అంటున్నారు బెహరావారు.

ప్రఖ్యాత తెలుగు వస్తాదు కోడి రామ్మూర్తిగారికి మోకాలుమీద పుండుబయల్దేరి చివరికది చీలమండవరకూ వ్యాపించి ఏ మందుకూ లొంగకపోతే – కాలు తీసివేయవలసివచ్చిందట ఆయన శిష్యులభుజాలమీద చేతులు వేసి ఆనుకుని కుంటుతూ నడిచేవారట. కుంటివాడయిన ఆ వస్తాదు నుద్దేశించి "సొట్టపులి" అనేకథ రాశాడని పురిపండావారు చెబుతున్నారు. ఇది ఎప్పుడు ప్రచురించబడిందో, ఏపత్రికలో ప్రచురించబడిందో కూడా వివరం తెలియదు

అతని కథలగురించి నేను సేకరించగలిగిన వివరాలివే. ఇక నాటికలగురించి.

చనిపోయే ముందు సంవత్సరాల్లో ఆంధ్ర పత్రిక ఉగాది సంచికల్లో నారాయణబాబు వరుసగా మూడునాటికలు ప్రచురించాడు. ఆ మూడు నాటికలూ నాకు లభించాయి. వాటి వివరాలు ఇవీ :

1. పాలవాన – (1959–60) వికారి సంచిక
2. గంగ – కాశ్యపి (60–61) - శార్వరి సంచిక
3 మల్లమదేవి కూతురు (61–62) ప్లవ సంచిక

ఈ మూడింటిలో పాలవాన చాలాప్రశస్తమైన రెండు అంకాల నాటిక.

ఈ నాటికకు ముందుమాటలో నారాయణబాబు ఇలా రాశాడు :

"మేము ద్రావిడులము. ద్రావిడులు దాక్షిణాత్య దేశానికి చెందినవారు ఏనాడో ఆంధ్రదేశంవలసవచ్చి అనేకతెగలు ఆంధ్రులలో కలిసి విలీనమైపోయినట్లు, వీరుకూడా ఆంధ్రులైపోయారు. అందులో మూడు తెగలు : ఒకటి పేరూరు ద్రావిడులు – వీరే పెద్దద్రావిడులు - దిమిల ద్రావిడులు, అరామ ద్రావిడులు అని కడపటి రెండు తెగలవారిని చిన్న ద్రావిడులంటారు. అందుకు కారణం, గోదావరిదాటుతే అగ్నిహోత్రాలారిపోతాయని, అట్లు ఆరిపోవడం శిష్టత్వానికి నిగ్గు తగ్గుతుందని. నదిని దాటకుండా, బ్రాహ్మణ్యానికి భంగం వాటిల్లకుండా, పేరూరులో ఉండిపోయినవారు పెద్ద ద్రావిడులు. ఆరామంలో నివాసమేర్పరచుకున్నవారు ఆరామద్రావిడులు గోదావరిదాటి ఎలమంచిలిప్రాంత లో దిమెలలో కాపురం ఏర్పరచుకున్నవారు దిమెల ద్రావిడులు. పెద్ద ద్రావిడులు యీషన్మాత్రం చుల్కనగ మమ్ములను చూస్తారు. ఇచ్చి పుచ్చుకోడాల్లోకూడా మా ఆడపిల్లలను వాళ్ళు చేసుకుంటారు కాని, వారి పిల్లల్ని మాకివ్వరు........

మేము దక్షిణదేశంనుంచి రావడంనుంచి దాక్షిణాత్య ఆచారాలు, అలవాట్లు మాలో చూచాయగా కనబడతాయి ముఖ్యంగా మాలో ఎవరైనా మరణిస్తే, వారికోసం ఆ పదిరోజులు, అహోరాత్రం నిలపించడమేకాకుండా, మనిషి మరణించిన ఆరుమాసాలవరకు, దినోదయవేళ, దినసావసానవేళ, కుటుంబానికి చెందినవారు పెరట్లో కొబ్బరిచెట్టుకింద, చెంబుతో నీరు తీసుకెళ్ళి, కళ్ళకు నీళ్ళురాసుకుంటూ, ఓఘంటైనా ఏడవాలి. ఇది పెద్ద బ్రావిడులలో జరుగుతున్న ఆచారం.

పోయినవారికోసం ఏడవడం మా ఆడువారు యించుమించు ఒక కళగా తయారుచేశారు. అలా రోదించేవారిలో కొందరు ఘనాపాటీలుంటారు. వారు ఏడుస్తూవుంటే పరామర్శకొచ్చినవాళ్ళు కడపరాయిహృదయం కలిగినవారైనా విలాప ఫణితులువింటే చంద్రోపలంలా స్రవించకతప్పదట. నాకు తెలిసినంతమట్టుకు మా అమ్మమ్మ కాశీ సోమయాజుల అమ్మనగారు, ప్రతిభావంతంగా ఏడిచేవారు. మాబంధువుల్లో ఎవరైనా

పోతే, ఆమెను తప్పక తీసికెళ్ళి, ఏడిపించి మరీ పంపేవారు. ఒకప్పుడు ఆవిడకు దత్తపుత్రుడు మరణిస్తే ఆవిడ విలాప మాధురులు విందామని పేరి కాశీనాధశాస్త్రి, మహా మహోపాధ్యాయ తాతారాయిడుశాస్త్రి వారు వచ్చి ఏడుపువిని, మెచ్చుకొని మరీ వెళ్ళారట.

.... .... (అవి) గాంధి మహాత్ముని సారధ్వితమున భారతావని సత్యాగ్రహ మహాసంగ్రామములో దూకి, విద్యాలయాలు న్యాయస్థానాలు బహిష్కరించి, శిబి ప్రముఖులకు తుల్యమైన త్యాగాన్ని చూపించిన మహోదయ దినాలు. ఆనాటి భావోద్వేగం అనన్యసామాన్యం''

ఊజ్జాయింపుగా చూస్తే ఈనాటిక కథాకాలం 1930 ప్రాంతాలు. అప్పటికి కన్యాశుల్కం యింకా పోయినట్టులేదు. అవధానులు శుద్ధశ్రోత్రియుడైన పేరూరిద్రావిడ కుటుంబానికి చెందినవాడు. భార్య సుభద్రమ్మ, కూతురు శారద, వీరు ఒక పల్లెటూళ్లో వుంటుంటారు. సౌభాగ్యమ్మ చిన్నద్రావిడ కుటుంబానికి చెందినవ్యక్తి, పట్నవాసి. కొడుకు రఘునాథరావు. సౌభాగ్యమ్మ పదివేలు కన్యాశుల్కం యిచ్చి కొడుక్కి అవధానులు కూతురు శారదను చేసుకుంటుంది. పిల్లను చిన్నద్రావిడులకు యివ్వడం యిష్టంలేకుండా పదివేలకు పెళ్ళి చేస్తాడు. (ఆ పదివేలతోనూ యజ్ఞం జరిపిస్తాడు) రఘునాథరావు జాతీయవాది. గాంధీ పిలుపువిని హరిజనులకు ఆలయ ప్రవేశం, వారితో పంక్తిభోజనం ఇత్యాది కార్యక్రమాలు చేస్తూవుంటాడు. ఇందుకు అవధానులు మండిపడి కూతురును కాపురం మాన్పించి యింటికి తీసుకువెళతాడు. తరవాత శారద మళ్ళ కాపురానికి రావడం, కొడుకుపుట్టి పోవడం రెండు అంకాల కూనడుమ జరిగిన కథ. ఈలోగా రాయలసీమలో కనీవినీ ఎరగని కాటకం వస్తుంది. ఆపరిస్థితి గురించి రెండవ అంకం పరిచయంలో నారాయణబాబే యిలా చెప్తున్నాడు:

"స్వరాజ్యము సిద్ధించకుండానె, పరుశురామప్రీతి అయిపోయిన భవనంలా, దేశంఏవత్తూ ఏమీతోచక, ముషికాల్లా త్యాగాలు చేసినవారు జైళ్ళలోంచి బయటపడి, జీవనాధారం కోసం, దిక్కులకు పరిభ్రమించి చీకువాలు దినాలు ....

"రాయలసీమ మహాక్షామము. తగిన ప్రచారం సహాయం జరగలేదు. కాబట్టి వంగదేశక్షామమె పెద్దదనుకుంటాంగాని, రాయలసీమక్షామము అంతుదొరకనంత హృదయవిదారకం.."

ఈ పరిస్థితుల్లో ఒక అసాధారణసంఘటన జరుగుతుంది.

కులాచారం ప్రకారం పోయిన పిల్లడికోసం శారద ప్రతిరోజూ విలపిస్తూ చేసినపాలను తానున్న మేడమీంచి కిందికి పాలధార పోస్తుంది. క్షామంలో భార్యాపిల్లలు మరణించగా రామన్న అనే దీనుడు రాయలసీమ నుంచి వచ్చి కళ్ళుతిరిగి వీరి మేడమెట్లుదగ్గిర పడిపోయి – పైనుంచిపడిన పాలధార త్రాగి ప్రాణం నిలబెట్టుకుంటాడు మర్నాడూ అదే పనిచేస్తాడు మూడోనాడు పట్టుబడి – దొంగగా పోలీసుల పాలపడతాడు. సంగతి తెలిసిన రఘునాధరావు అతన్ని దారిలోనేవిడిపించి తీసుకొస్తాడు. భార్యను అతనికి అన్నం పెట్టమంటాడు. శారద అంతావిని కోపగిస్తుంది. శిక్షించడంమాని ఆదరిస్తున్నందుకు పెనిమిటిని ఆడిపోస్తుంది. ఈ దురాగతం చూడలేక పుట్టింటికి వెళిపోవడానికి నిశ్చయించు కుంటుంది. ఇదీ నాటిక. ప్రతీ అక్షరమూ అత్యంత వాస్తవంగానూ ప్రతిభావంతంగానూ రచించాడు నారాయణబాబు.

రెండవనాటిక పేరు మల్లమదేవి కూతురు. ఇందులో అయిదు చిన్నిచిన్ని అంకాలున్నాయి. ప్రదర్శిస్తే అరగంటలోపునే ముగిసే చారిత్రాత్మక నాటిక. బొబ్బిలియుద్ధంనాటి యితివృత్తం. రంగారావు – బొబ్బిలిరాజు, రామారావు – సైనికుడు, మల్లమ్మదేవి – బొబ్బిలిరాణి, మల్లమ్మదేవి కూతురు, వెంకుమాంబ-దాది, వీరు అయిదుగురూ పాత్రలు.

బొబ్బిలిలో తాను విన్న ఒక సంఘటనను ఈనాటికగా మలిచానని చెబుతున్నాడు నారాయణబాబు:

"బొబ్బిలివూరు అవతల ఒకొనొకస్థలంలో కొంతమంది స్త్రీజనంచేరి దీపాలదగ్గిర కూర్చొని బొబ్బిలి కథ పాటగా శ్రావ్యకంఠాలతో పాడుతున్నారు. దగ్గిరగా పోయిచూద్దామని మేము విశ్వప్రయత్నం చేశాము,కాని కొంతమంది పురుషులు మమ్మల్ని వెళ్ళకూడదని నివారించారు. ఇందుకు కారణమేనని మే మడిగాము. అందుకు సమాధానంగా వారేమన్నారంటే ఆ దీపాలు వెలుగుతున్న స్థలం మల్లమ్మదేవి కూతురు సమాధని, అక్కడచేరిన వనితలు, ఈడొచ్చి యవ్వనవతులైన పెండ్లికాని వెలమపడుచులని, వెలమవారికి ఘోషా వున్నదని అన్నారు. పౌర్ణమినాడు సాయంత్రం మల్లమ్మదేవి కూతురు సమాధిదగ్గిర దీపారాధనచేసి, బొబ్బిలిపాటపాడి, మల్లమ్మదేవి కూతుర్ని తలుచుకొని ప్రసాదం తింటే పెండ్లికాని పడుచులకు పెండ్లవుతుందని, యదార్థమని చెప్పారు. బొబ్బిలిప్రాంతాల పల్లెటూళ్ళలో కొందరి వృద్ధ ముత్తయిదువుల దగ్గిర తెలుసుకున్న కథనే ఈనాటక ప్రయోగం కింద వినియోగించాను.''

ఈ నాటికలో మల్లమదేవికూతురు నాయిక. ఆమె వీరుడైన రామారావును ప్రేమిస్తుంది. అతడుకూడా వెలమ కులానికి చెందినవాడే అయినా ఒక సామాన్యసైనికుడు. అందుచేత తల్లిదండ్రులకు ఈ ప్రేమ ఆమోదం కాదు. మల్లమదేవి రామారావును అజ్ఞాతంగా ఎక్కడికైనా వెళ్ళిపొమ్మంటుంది. రాణి కోరికమేరకు అతను దూరంగా తప్పుకుంటాడు, యుద్ధ సమయంలో మాత్రం విజయనగర సేనలతో అరివీర భయంకరంగా పోరాడి మరణిస్తాడు. మనసు మార్చుకొని మల్లమ్మదేవి కూతురు అతని మృతదేహంతో సహగమనం చేస్తుంది. ఇదీ కథ. మల్లమదేవి కూతురనడమే తప్ప ఎక్కడా ఆమెపేరు వినబడదు బహుశా నారాయణబాబుకి కూడ తెలిసివుండదు. ఆనాటి బొబ్బిలి వెలమరాచరిక వ్యవస్థను ఈ నాటికలో చక్కగా చిత్రించాడు.

మూడోనాటిక గంగ-కాశ్యపి. ఇందులో రెండు రంగులున్నాయి. గంగ–కాశ్యపి అనే అప్పచెల్లెల్లు ఇందులోని ప్రధానపాత్రలు. వీరి పేర్ల వెనక ప్రతీకలున్నాయి. గంగ నీటికి, కాశ్యపి భూఖండానికి ప్రతీక. గంగపెద్దది. కాశ్యపి ఆమె చెల్లెలు గంగ-చెల్లెలికి పెళ్ళిచేయాలని ప్రయత్నిస్తుంది అది స్వయంవర వివాహం ఒకరాజు, సైన్యాధిపతి, వ్యాపారస్తుడు, అర్చకుడు, రైతు - వీరంతా కాశ్యపిని వర్ణింపగోరి అమూల్యకానుకలు పంపిస్తారు రైతుమాత్రం ఖద్దరుచీరా,

గన్నేరు పూవులూ పంపిస్తాడు. చివరికి కాశ్యపి రైతునే వరిస్తుంది. ఇందుకు గంగ అలుగుతుంది.

"నేను గంగను నేను మీ యిద్దర్నీ శపిస్తున్నాను. నేను మీదగ్గిరుండను. మీకు కనిపించకుండా ఊర్ధ్వముఖంగా పోతాను. మీరు చచ్చినా దివినుండి దిగిరాను భువికి" అంటుంది.

ఇందుకు కాశ్యపి తగిన సమాధానమే చెబుతుంది.

"పూర్వకాలం కాదిది. శాస్త్రీలలో భయపడి భక్తితో నిన్నర్చేందుకు విజ్ఞానయుగం ఇది. నువ్వెక్కడికెళ్ళి ఎక్కడ దాగినా జుత్తుపట్టుకు నిన్ను తెచ్చుకోగలం. అప్పటికి నీవుమాకు లభ్యంకావా. నీలాంటిదాన్ని మా ఆశలు పండించేందుకు మా దాహం తీరేందుకూ, మాకడుపు చల్లబడేందుకూ మాబుద్ధి కుశలతతో కృతకంగా నిన్ను తయారుచేయగలిగిన సామర్థ్యం శాస్త్రవేత్తలుసంపాదించుకున్నారు, నీవెక్కడికెడతావో వెళ్ళు' అంటుంది.

దీనితో నాటిక ముగుస్తుంది.

మొదటిరంగంలో గంగ-కాశ్యపి నడుమ నడిచిన సంభాషణలో ఎన్నో ఆదర్శాలు చర్చించబడతాయి. కొన్నిచోట్ల సైద్ధాంతిక చర్చకూడవున్న కారణంచేతసంభాషణలు సుదీర్ఘంగా తోస్తాయి అయినా ప్రదర్శనయోగ్యమైన చక్కని నాటిక.

ఈనాటికలు రేడియోలో ప్రసారం అయ్యాయని శ్రీరంగం నారాయణరావుగారు రాస్తున్నారు.

మళ్ళీపెళ్ళిలో మరిచిపోయిన రీలు - అనే నాటికకూడా ప్రచురించాడని రూపవాణి, ఢంకా మొదలైనవాటిలో నో ప్రచురించబడిందనీ చాసో అంటున్నారు. అదికూడా లభిస్తే నారాయణబాబు నాలుగు నాటికలు రాసినవాడవుతాడు.

రెంటాల గోపాలకృష్ణ రచించిన "సంఘర్షణ" కావ్యానికి నారాయణబాబు ప్రవర అనేపేరుతో సుదీర్ఘమైన పీఠికరాశాడు ఇందులో అభ్యుదయ కవితాలక్షణాలను క్షుణ్ణంగా పరిశీలించాడు. ఇది విడిగా ప్రచురించబడితే చాలా మంచి వ్యాసమే అవుతుంది. నారాయణబాబు మరికొన్ని పుస్తకాలకుకూడా పీఠికలురాశాడు. అవన్నీ కొద్ది మార్పులతో చిన్నా పెద్దా వ్యాసాలవుతాయి.

నారాయణబాబు, నాగంటి సోమయాజులుకుచాలా పెద్ద పెద్ద ఉత్తరాలు రాశాడట. అందులో అనేక వ్యక్తిగత విషయాలతోపాటు సాహిత్యసంబంధమైన విషయాలుకూడావున్నాయి. కానయితే అవి తన అనంతరమే ప్రచురణకావడం యుక్తం అని చెబుతున్నారు చాసో కవితల్లోనూ, కథల్లోనూ, నాటికల్లోనూ. గ్రంథ పీఠికల్లోనూ ప్రతిబింబించినకంటే ఈ వుత్తరాల్లో నారాయణబాబు వ్యక్తిత్వం మరింత బాగా ప్రతిబింబిస్తుంది.

"ఆంధ్రప్రదేశ్ దర్శిని"లో "తెలుగు వెలుగులు" శీర్షికలో శ్రీరంగం నారాయణబాబు గురించి వ్రాయబడింవాట్లో మరికొన్ని వివరాలు లభిస్తున్నాయి.

"విజయనగర రచయితల సంఘ అధ్యక్షులు. అధి వాస్తవిక రచనకు ఆద్యులు. సంపంగితోట (ఛకోవ్ నాటకానువాదం) కొన్ని కథానికలు, సాహిత్యవిమర్శలు, రేడియో ప్రసంగాలు"

ఇతని సాహిత్య విమర్శలకోసం. రేడియో ప్రసంగాల కోసం ఇంకా అన్వేషణ సాగించవలసివుంది.

# 4

శ్రీశ్రీకి, నారాయణబాబుకీ కవితా రచనలో పోలికలు కంటే, తేడాలే ఎక్కువగా వున్నాయి. నారాయణబాబు జీవిత కాలంలోనే "రుధిరజ్యోతి గ్రంథరూపంలో రావడానికి 18 ఏళ్ళ ముందే - రోణంకి అప్పలస్వామిగారు 1954లో భారతిలో "రుధిరజ్యోతి - ఒక ప్రస్తావన" అనే వ్యాసంప్రచురించారు. నాటికీ, నేటికీ రుధిరజ్యోతిపై అధికారమైనఅభినివేశంతో వెలువడిన విమర్శనావ్యాసం అదొక్కటే? నారాయణబాబు కవితా రీతులనుగురించి వారుచెప్పిన అతి ముఖ్యమైన విషయాలను ఇక్కడ ఉదహరిస్తున్నాను.

"శ్రీశ్రీ పేరు వినగానే నారాయణబాబు, నారాయణబాబు పేరు వింటే శ్రీశ్రీ మనకు చటుక్కనస్ఫురిస్తారు. దానికి కారణం ఏమయినా వీరి కవిత్వపు పోకడలు మాత్రం వేర్వేరు స్వీకరించిన కవితా వస్తువు ఒక్కొక్కచో ఒకటి కావచ్చును.

కాని వారు దర్శించే పద్ధతులు, వ్యక్తీకరించే రీతులు మాత్రం విభిన్నములు. ఇందులో ఇరువురికీ ఏమాత్రం పోలికలు కనిపించవు. ఉద్రేక జనితాలయిన శక్తులు, స్వీకరించిన దృక్పథం విభిన్నాలు పరిగ్రహించిన అలంకారాలలో శబ్దప్రయోగంలో ఎవరి త్రోవవారిది, ఎవరిపోకడవారిది. శ్రీశ్రీ స్థూలదృష్టికికూడా దొరుకుతాడు. నారాయణబాబు కొన్ని తావులలో సూక్ష్మదృష్టికి పినా స్పష్టంకాడు. నోటికిపట్టే ఛందస్సులలో శ్రీశ్రీ పరుగులుతీస్తాడు. తనలక్ష్యాన్ని ప్రత్యక్ష పద్ధతిని వ్యక్తంచేస్తాడు. నారాయణబాబుసరుగులో శ్రీశ్రీకిగల ఉద్వేగంలేదు అతనిది పరోక్షపద్ధతి. ఇద్దరూ పాశ్చాత్య కవితా సంప్రదాయాలను మననం చేసుకొనినవారే.[10]

భావకవులకు నారాయణబాబుకుగల ప్రధాన విభేదాన్ని వారిలా విపులంగా వివరిస్తున్నారు :

"ఒకే వస్తువును సందర్శించిన, భావకవులొక పద్ధతిని వాస్తవికులు మరి ఒక పద్ధతిని అవలంబించి, తమ భావాల నభివ్యక్తం చేస్తారు దీనికి తెలుగు కవితనుంచి ఒక ఉదాహరణ నిస్తున్నాను. రాత్రి, ఆకాశంలో మెరిసే నక్షత్రాలు కృష్ణశాస్త్రిగారికొక రీతిగాను, నారాయణబాబుకు మరిఒక రీతిని స్ఫురించాయి. అందుకే శ్రీ శాస్త్రిగారు -

నింగి మూలల నీలి పందిళ్ళపైచి
వింత చిగుమల్లెతోట వేయించినాను

- అనేటప్పుడు వారి భావన సముజ్జ్వలమే మరిదీనినే నారాయణబాబు ఉత్ప్రేక్షించిన విధం గమనించండి !

నల్లని త్రాచు కోరలు
తెల్లని మశూచి కుండలు
గగనమ్మున చుక్కలు

లోకంలో ఎటువంటికించినా, బీభత్సమే కనిపిస్తున్న కవికి ఆకాశంలో చుక్కలు ఆనందాన్నీయవు. నక్షత్రాలొకేసారి త్రాచుకోరలవలె మశూచి కుండలవలె భయంకరంగా గోచరించడం కవికి సహజం. లోకంలో విశ్వమానవకల్యాణం, జీవితం మంగళప్రదం కావాలని అతి ప్రాచీనకాలంనుంచీ, కవులంతా వాంఛిస్తూనేవున్నారు. కావ్యాలలోనివస్తువులను మంగళప్రదాలుగా భావించి, మంగళాంతం చేసినంతమాత్రాన ఇవి

సిద్ధించదు .... జీవితంలో కాఠిన్యమును బయటపెడుతున్నప్పుడు, భీభత్సతను స్ఫురించే పైగీతాలవంటివి రచియింపక తప్పదు. మాలిన్యాన్ని కప్పిపుచ్చుకోవడంలో అది మటుమాయంకాదు. దానినిబహిర్గతం కావించాలి. వస్తువును సామాజిక విమర్శనాదృష్టితో తరచి తరచి చూడవలసివుంటుంది. సమాజాన్ని ఎక్కడికక్కడ విమర్శించడం, వాస్తవికవాదలక్షణం. ఈ లక్షణం నారాయణబాబు కవిత్వంలో ప్రస్ఫుటంభావ కవిత్వంపై తిరుగుబాటు, వస్తువ్యాకరణాలతో అగక విప్లవ పథాలను పడుతుంది; రీతిలోను. వస్తువులోను సరికొత్తదనం కనిపిస్తుంది. ఎవరూ చెప్పని పద్ధతినిచెప్పడం అతనికిసరిదా. "ఇమేజిస్టు'' కవితకు ఇతను ప్రాణం పోస్తాడు. శబ్దార్థాలతో కుదించ సొగసైన విగ్రహాలను నిర్మించే శిల్పి. క్లుప్తత ఇతని పద్ధతి .... పదిమాటలలో చెప్పవలసినది ఒకమాటలోచెప్తాడు. ఈ శిల్పం సాధారణులకు అలవడేదికాదు''

నారాయణబాబు కవితను అనేకులు అర్థంచేసుకోలేక పోయారు. మరికొందరు అపార్థం చేసుకున్నారు. అందుకే కొందరు విమర్శకులు – ముఖ్యంగా విరసం వర్గానికి చెందిన (కె. వి. రమణారెడ్డిప్రభృతులు) నారాయణబాబులో బొత్తిగా స్పషత (clarity) లేదన్నారు.

"శ్రీశ్రీ స్థూలదృష్టికికూడా దొరుకతాడు. నారాయణబాబు కొన్ని తావులలో సూక్ష్మదృష్టికివినా స్ఫురించడు .... అతనిది పరోక్ష పద్ధతి'' అన్న రోణంకివారి మాటల్ని వారు మరోలా అర్థంచేసుకుని స్పష్టత లేదని అంటున్నారు.

నారాయణబాబు పాశ్చాత్య కవితా సంప్రదాయాలను, భారతీయ సంప్రదాయంతోజోడించిబహుసవర్ధవంతంగాకవిత చెప్పిన కొద్దిమందిలోప్రథమగణ్యుడు. మొదటిశ్రేణి ఇమేజిస్టు కవిత రాస్తూనే సంప్రదాయపద్ధతికి చెందిన పదచిత్రాలనువయోగిస్తాడు. ఇందుకుదాహరణంగా "దేశమాత'' కవితలోంచి కొన్ని వాక్యాలు –

గుప్పెడు అన్నం గుక్కెడు నీళ్ళ స్వాతివానకే
ముత్యపుచిప్పై కరువేరూపందాల్చి కడుపేచెరపై ఏడ్చి
నెలత ఒకర్తుక నిలబడ్డాడి భిక్షాపాత్రతో

.... ....

బలిప్రముఖుల పాతర మాభూమి అతిథిపూజలకు
మొదటి వారలము ! కర్ణుడు మావాడంటూ
గంతులువేసే దేశనాయకులు అన్నపూర్ణను
ఆరాధించే ముగుదలు జాలకములపై
తడిసినవట్టివేళ్ళ తట్టీలుకట్టిన ఇండ్ల ద్వారముఖమ్ములు
బంధించారు కన్నులుమూసి నిద్రించారు

.... .... ....

అసువులువీడి చచ్చిన దేశమాతయై
చాపచుట్టుగ నేలకు వాలింది !
వీధికాలువను బురదనీటిలో విశ్రమించిన
శ్వానాధుడొక్కడు నిశ్వసించినాడు
భూపతిఆజ్ఞను భూమిపట్టువు చిమ్మనచొరబడ్డాడి
శీలంకోసం అనాడు !
అకలిదీర్చని మానంగప్పని దేశంకోసం
మట్టిప్రమిదలో వత్తైకాలింది మానిని ఈనాడు !!

పై వాక్యాల్లో గుక్కెడు నీళ్ళ స్వాతివానకు ముత్యపు చిప్ప కావడం, దానానికి ప్రసిద్ధుడైన పురాణపురుషులు బలినీ, కర్ణుడినీ ఉదహరించడం, అన్నపూర్ణనుఆరాధించేముగుదలనడం' మరణించిన బిచ్చగత్తెకోసం మానవమాత్రుడెవడూ కనీసం నిట్టూర్పయినా విడువకపోగా వీధికాలువలో బురదనీటిలో నిశ్వసించిన కుక్కను శ్వానాధుడని గౌరవవాచకంతో ప్రయోగించడం, అలనాడు అగ్నిప్రవేశంచేసిన సీత ప్రసక్తి తీసుకురావడం ఇవన్నీ సంప్రదాయబద్ధమైన రీతిలో రచనచెయ్యడంగా మనకు స్పష్టపడుతున్నాయి. వీటిలోఎక్కడా శబ్దానికి సంబంధించిగాని, అర్థానికి సంబంధించిగానిఅస్పష్టతలేదు. లేకపోగా గుప్పెడు అన్నం మెతుకులకోసం అలమటించిన బిచ్చెకత్తె వస్తే – బలి, కర్ణుడువంటి దానపురుషుల కథలు చెప్పుకునే పెద్దమనుషులు, తమనుతాము అన్నపూర్ణతో ఉపమించుకునే ముత్తయిదువలు తలుపులు వేసుకున్నారనివ్యంగ్యంగా వెక్కిరించాడు. బిచ్చగత్తె అనువులువీడి నేలకూలితే దేశమాతే చాపచుట్టగా నేలకూలినట్టుందని విషాదంగా చెప్తున్నాడు. దయాహీనులైన మానవులెవరూపట్టించుకోకపోతే వీధికాలవలో శ్వానాధుడు నిశ్వసించాడు. ఆకలి దీర్చని, మానంగప్పని ఈ దేశంలో ఆ బిచ్చగత్తె మట్టిప్రమిదలో వత్తిగా కాలిపోయింది. ఎన్నో సాంప్రదాయికమైన ప్రతీకలతో రచించబడిన ఈ కవితలో స్పష్టతలేదని ఎవరనగలరు ?

"గడ్డిపరక'' అనే మరో ప్రసిద్ధకవిత చూద్దాం. సమాజంలో పతితులై పడివున్న పేదల ప్రతినిధిగా 'గడ్డిపరక' తన కంఠం వినిపిస్తుంది. పేదల జీవితాలపై ధనికుల దాష్ట్యాన్ని – రెండువర్గాల నడుమగల సంఘర్షణను చాలా ప్రతిభావంతంగా చిత్రించాడు నారాయణబాబు. ఇక్కడకూడా అతను పురాణ కావ్యాలలోని గాథల్ని తీసుకుని తాను చెప్పబోయే అంశానికి అన్వయించి – అభ్యుదయ దృక్పథంకొరవడకుండా అన్వయ కాఠిన్యంలేకుండా సమర్థవంతంగా నడిపించాడు కవితను.

"నడవండి నడవండి ! నామీంచి నడవండి. గడ్డిపరకను గడ్డిపరకను" అని ప్రారంభిస్తుంది పూజాసమయాల–పూవను దూర్వాంకురాన్ని – అవసరంతీరాక – అపతల కనబడితే – చుల్కలగ చూచేటి – గడ్డిపరకను! – అని మానవుడి స్వార్థబుద్ధిని వెక్కిరిస్తుంది. 'పల్లకీ–దిగినట్టి - పెళ్ళికొడుకులు మీ–పట్టువాసిని నేను' అని తన ప్రాధాన్యాన్ని జ్ఞప్తికితెస్తుంది 'పశువుల నోటికి–పాయసాన్ని మీకు మార్గ పాదాలకుకరికను' అనికూడా చెబుతుంది అంతేకాదు మరికోవిషయంకూడా గుర్తుచేస్తుంది. 'మీపైడిపాదాల మృదురజోలేశాల నాహృత్కుశేయములో ఉల్కలా పాతాలు' అని హెచ్చరిస్తుంది. ఇవన్నీ ప్రస్తుత విషయాలుకాగా పురాణాల్లో తన ప్రాశస్త్యాన్నికూడా గుర్తు చేస్తుంది. 'మాతృవర్గంవాడు మాఅన్న పన్నగమ్ముల రసనలుత్తరించినమిన్న' అని చెబుతుంది గడ్డిపరక దర్భ మాతృవర్గానికి చెందినది, అన్నగారివంటి దీను. అనిసర్పాలు నాల్కలను రెండుగా చీల్చిన ఉదంతం ఎత్తుతుంది. సంప్రదాయమే ప్రాణంగా జీవించేవారికి తానెంత ముఖ్యమైనదో చెబుతుంది. 'నేటికి మీ పితృకార్యంనాడు/ ధారణమీద మీ చేతిమీద/మరకత/అంగుళీకమ్ము! గతులు కల్పించేటి / గడ్డిపరకలము' అంటుంది. చివరికి కాకాసురునికథకూడా జ్ఞప్తికితెచ్చి

ఆగండి ఆగండి' అని హెచ్చరిస్తుంది. గడ్డిపరక పేదజనానికి, ప్రతీక పేదవారి త్యాగం ధనికులకెంత అవసరమో ఈ కవిత అంతా అంతర్లీనంతా ప్రతీకాత్మకంగా చెప్పబడింది. గడ్డిపరకే మహాశక్తివంతమైనదై కాకాసురుని గర్వం అణిచిన రామాయణంలో ప్రసిద్ధిమైనది, పేదవారి శక్తి దుర్నిరీక్ష్యమై ధనికులను ఓడించగలదు నారాయణబాబు ఈ కవితద్వారా హెచ్చరిస్తున్నాడు. ఈ విధమయిన రచనా విధానము 'కవితకు క్లాసికల్ స్వభావాన్ని ప్రసాదిస్తుంది' అంటున్నారు రోణంకివారు. ఈ 'గడ్డిపరక' ముందు మహాకవులనిపించుకునేవారి కొన్ని కవితలు గడ్డిపరకకుకూడా కాకుండా పోతాయి.

భావ కవిత్వపు పోకడలమీద యెదురుదాడితీస్తూ రాసిన 'ఊరతవల' అనే గీతంలో ఫ్రెంచి, ఆంగ్ల సంప్రదాయాల ప్రభావం కనిపిస్తుంది. నారాయణబాబుకు ఫ్రెంచి ఏమాత్రం వచ్చునో తెలియదుగాని ఫ్రెంచి కవితా సంప్రదాయాలను బాగానే చదువుకున్నాడు.

'కలల పొదరిళ్ళలో / సౌఖ్యంపు నిదురలో / కనిపించి
ఒక తన్వి / మేనక నాపేరు
మేఘాలకు వెనుకప్రక్క / మా ఊరని మాయమయ్యె'

అనడంలో భావకవులపై వెక్కిరింపు స్పష్టంగానే కనిపిస్తున్నది. ఇందులోని "ఆకాశం కాకిపిల్ల/నోరుతెరచె / మేతకొరకు / పాఫిష్టి ఇనోదయమ్మె / పాముకాటు ఎండపొడిచె / భువికి తగిలె / శివజ్వరం!' వంటి వాక్యాలలో ఇమేజిస్టు కవిత అత్యున్నతశిఖరాల నందుకుంది. ఆకాశం కాకిపిల్ల మేతకొరకు నోరుతెరచె అని చెప్పడంలో అంతులేని ఆకలిని సూచిస్తున్నాడు. ఇనోదయమై తెల్లవారితే ఆకలితో గడపవలసిన మరికొకరోజు వచ్చిందన్న బాధ పాముకాటులా వున్నదట! ఈ కవితలో యాంత్రిక నాగరికతా స్వరూపంకూడా ప్రతిబింబిస్తుంది. దుస్వప్నంలా భుగభుగమను పొగగొట్టం, ఆకాశం చిల్లుపడేలామిల్లు అరవడం, పోలీసుల ఈలకు నిశిరాతిరి పసిపిల్లడి కలతనిదురలో కళవళపడ్డట్టు కణకణమండే కళ్ళతో కార్మికసోదరుడు అదిరిపోవడం-ఇవన్నీ అందుకుదాహరణలె. కాగితాలుతిని నెమరేసుకుంటున్న గాడిదనుగార్దభస్వామిఅనడం ఎంతో గొప్పగావుంది. ఆ తరవాత కల్లుగీత అయినతరవాత మ్రోడుల్లావున్న తాటిచెట్లని-తురకలపండగలలో ఊరేగేపీరుల్లా వున్నాయంటాడు. "అల్విదా అల్విదా'' అంటూ తురకల విషాదగీతం గుర్తుచేస్తాడు. గీతానికి బరువైన విషాదాన్ని చేర్చుతుంది ఈఒక్కమాటాను. అక్రమ సంబంధంవల్ల పుట్టిన బిడ్డను తల్లే గొంతునిలిమి పారేస్తే.... "రక్తసిక్త – మోము తోడ మా అమ్మే చంపింది! మా అమ్మే చంపింద'ను మౌనముగ గాజుకళ్ళ పురిటిపిల్ల!" కవితా రచనలో నారాయణబాబుకంటె క్లుప్తతను సాధించిన కవి ఆధునికకాలంలో మరొక్కడు లేడు. మరొక విశేషంకూడా నారాయణబాబు కవితలో వున్నది. రోణంకివారి మాటల్లో – "సభా వేదికలమీదనుంచి వినిపించే ఉపన్యాసధోరణి,కవిత్వంచెప్పేవారికి విసర్జనీయం. ఉపన్యాసం మంచి కవిత్వ పద్ధతికాదు.... కవిగా నారాయణబాబులో వక్తృత్వధోరణి వినిపించదు. మరి వ్యక్తిగా అతను ఉపన్యాసకుడే. అతని కవిత చదివినపుడు సద్యఃస్ఫురణ కలుగదు. తరచినకొద్దీ అమృతాన్ని చిలుకుతుంది.'' అంచేత వాక్యగతమైన అర్థం సామాన్యులకు అనేకసార్లు వెంటనే స్ఫురింపదు. దీనికితోడుఅతడు కవిత్వంలో హ్రస్వలిపి వాడతాడు. విపరీతమైన చీకటి అని చెప్పేందుకు – " ఆడ మగ తడిమిన తెలియని తాండ్రపాపారాయుడు తమస్సు'' అంటాడు. తాండ్రపాపారాయుడి మనసులో విజయనగర రాజులపైగల పగఎంత చిక్కనైనదో చీకటికూడాఅంతచిక్కనైనది అనిచెప్పడం అతని ఉద్దేశం. క్లుప్తత, సద్యఃస్ఫురణ లేకపోవడం, హ్రస్వలిపి – సంప్రదాయాన్ననుసరించిన ప్రతీకలు – వీటి కారణంగా నారాయణబాబు కవిత చాలా గాఢత కలదై అనేక మందికి "అర్థంకాని, అర్థంలేని కవిత'గా కనిపించింది.

భావకవులపై సేరుగా దెబ్బతీస్తున్న వాక్యాలు "కవీ'' అనే గీతంలో చూడండి: "ఖ్యాతి గడించే / గీతం వ్రాసి / ప్రేయసి కంకితమీయాలంటూ మూతిబిగించి / చేతులు నులుముతు / కూచున్నావ !!!'

నారాయణబాబు ఉపమలూ, శబ్దచిత్రాలూ అనేకసార్లు భయోత్పాతాన్ని కలిగిస్తాయి, బాగాఆలోచిస్తే ఎంతో అంత కరుణనీ కలిగిస్తాయి – సమాధిలో / మృతశిశువువట్టుల/ జలదాంతరశశి – (కావాలి) కాలిన ప్రేయసి / దేహం / చమురు కంపు – (పండుగనాడు)

నల్లని తాచుకోరలు / తెల్లని మశూచికుండల / గగనమ్మున / తారలు ! (–కవీ!)

చచ్చిన బాలింతల/వెచ్చని చనుబాలతీపి (-దేశమాత)

తురకల గోరీలందున / క్రైస్తవుల సమాధులందున/ హిందూ స్మశానవాటుల / కపాలమ్ములు / వికవిక నవ్వినవి / (కపాలమోక్షం)

తలకొలని తల్లిశవం (–తెనుగురాత్రి)

–ఇలా ఎన్నయినా ఉదహరించవచ్చును.

'విశాఖపట్నం' నగరంపై నారాయణబాబు గీతాన్ని మించినదాన్ని అంతకుముందుగాని ఆతరవాతగాని మరెవ్వరూ రాయలేదు. (ఈగీతం చదివిన స్ఫూర్తితో 'విశాఖపట్నమ్' పై ఒక చిన్న వచనకావ్యమే ప్రచురించాను) గత 40 సంవత్సరాలలోనూ విశాఖపట్నంలో నారాయణబాబు చూపించిన లక్షణాలు ఏవీ మారలేదు. [ఎప్పటికీ మారవు!]

"తప్పుకో/తప్పుకో/దారిలేకపోయినా/కారుమట్టేస్తుంది" అప్పటికి సిటీబస్సుల్లేవు. "దోసెడంతసందుల్లో / గోదావరంత కుళ్ళుకాలవలు''...."పిలవకుండా/పలికే ముండలకు / పిలిస్తే పలికే జబ్బులు/భోగంవాళ్ళిళ్ళల్లో/భోగించిన / దేవేంద్రులు/ శాపవిమోచనంకొరకు / చేరుకుంద్రు ఆసుపత్రి / సహస్రకోటి జబ్బులకు/అనంతకోటిడాక్టరు / మందులకోసం / మానవులు / ప్రాణానికాదు – రోగానికి – ప్రాముఖ్యం అక్కడున్న ప్లీడర్ల గురించి – "కలకత్తా కాశినైనా – కోర్టుకు రప్పించగలరు – కర్మసాక్షిచేత దొంగసాక్ష్యమిప్పిస్తారు ...'' చివరిగా "ప్రజల పాపం హార్బరు చేసేందుకే – హార్బరు – ధర్మామీటర్లలాంటి కొయ్యలతో–ఎనిమా డొక్కుల్లాంటి–స్టీమర్లు–నగ్నంగా స్త్రీ – స్నానంచేసేటప్పుడు–ఎదురుగుండా పరాయిమొగాడు-ఏరాడ కొండ–ఆలీబాబా–అబ్ధి–నారాయణబాబుకు సంగీతంలో చాలా లోతయిన పరిజ్ఞానంవుంది. ఫిడేలునాయుడిగారివేళ్లు. దరిద్ర సంగీతం అనే కవితలిందుకు ఉదాహరణగా చూపవచ్చు.

ప్రతిభ (1940–41)లో అచ్చయిన సంగీతం అనే గీతానికి నారాయణబాబు వివరణరాస్తూ సంగీతం మంటలు పుట్టించిన ఉదంతాన్ని ఉదహరించాడు. ఈ కవితకు రాసిన ఈ వివరణ చివర మరో చిన్న కవిత రాశాడు

నాడు సంగీతం–మంటలుపుట్టిస్తే
నేడు ఆకలిమంటలే–సంగీతాన్ని పలికించాయి

ఇంకా రాజాజీ, వీధిపాటకులు, భగత్‌సింగుశాపము మొదలైన కవితల్లోకూడా సంగీతం ప్రసక్తి వుంది.

భగత్‌సింగు శాపము ప్రత్యేకంగా పేర్కొనదగిన కవిత.

ఈ గీతంలో భగత్‌సింగ్ ఉరి రాత్రివేళ జరిగిందని సూచిస్తున్నాడు.

"క్రతువంటూ పశువంటూ నిను బలియిచ్చిన
ఋషులంతా పటాపంచలై నారు
నీగళమ్మున నిరాకరణసూత్రం పైచి
నిలువునా ఉరితీశారా నాతండ్రి! "

అనడంలో పాతికేళ్ళపసివయసులో దేశంకోసం ప్రాణాన్ని పణంగాపెట్టిన భగత్‌సింగుపై కరుణ ఉప్పొంగుతుంది.

"నాటికి నేటికి భారతభూమి
పాడియావునకు కళ్ళల్లో కాటుక పొగలు
బుఱ్ఱను భూకంపం
గుండెల్లో కుతమత ఉడికే లావా!"

అన్న వాక్యాల్లో భారతదేశం పాడియావువలె బ్రిటిష్ వారికి సంపదను పిదికియిస్తున్నదనీ, కళ్ళల్లోవిషాదపు కాటుక పొగలు. బుఱ్ఱలో భూకంపం వున్నదనీ చెబుతూ - గుండెల్లో కుతకుతఉడికేలా వాఉన్నవని హెచ్చరిస్తున్నాడు. అభ్యుదయ కవితను అధివాస వికమైన హ్రస్వలిపిలో రచించడం నారాయణబాబు ప్రత్యేకత.

"భగత్సింగ్ శాపము" ఆనాటి యువతలోని అసంతృప్తికి తిరుగుబాటు తత్వానికి ప్రతీక–అంటున్నారు తుమ్మల వెంకటరామయ్యగారు. [12]

"తెలుగు కావ్యమాల"లో కాటూరి వేంకటేశ్వరరావు గారు - నారాయణబాబు [13] జానపదగేయాలుకూడా రచించాడని రాసి "రంగమెళితేనేటి?" అనే గేయాన్ని సంకలనంలో చేర్చారు. దీన్ని అనుబంధంలో ఇస్తున్నాను.

మౌనశంఖం అనే సుదీర్ఘకవితలో శ్రీశ్రీ పైగల అభిప్రాయాన్ని స్పష్టంగా వ్యక్తంచేశాడు. అతని మనస్సులో తమ యిద్దరికీ అవినాభావసంబంధం వుండపట్టే ఈ విదంగా రాశాడు.

'ఎన్నిమార్లు నీవు లెక్కపెట్టినా
నన్ను మరచినా నీవు
ఉన్నవాళ్ళం ఇద్దరం ?
నీటికన్న రక్తం చిక్కన
కవులమైనా అన్నదమ్ములమైనా
గర్భశత్రువులమైనా
శ్రీశ్రీ నేనూ'

ఇంతేకాదు. నారాయణబాబు తన రుధిరజ్యోతి కావ్యాన్నే శ్రీశ్రీకి అంకితం చేశాడు.

నీ పాటల కత్తులతోనే
నా హృదయం నెత్తురుతీసి
నే వెలిగించిన
ఈ దీపపు కాంతిని నర్తింపుమురా
శ్రీ శ్రీశ్రీ

అయితే నారాయణబాబుది తక్కువ తప్పేమీకాదు. శ్రీశ్రీ స్వయంగా తయారుచేసియిచ్చిన "రుధిరజ్యోతి" Press Copyని తానే పారేసుకున్నాడు. లేకుంటే నారాయణబాబు జీవితకాలంలోనే ఇది అచ్చుపడి వుండేది.

## 5

నారాయణబాబుకి ఆధునిక వచన కవితపై ఎటువంటి అభిప్రాయాలున్నవి పరిశీలిద్దాం. రెంటాల గోపాలకృష్ణ రచించిన "సంఘర్షణ" కావ్యానికి ప్రవర పేరుతో బహు విపులంగా రాసిన పీఠికలో నారాయణబాబు యిలా అంటున్నాడు :

సాహిత్య జగత్తుని గంగవెర్రులెత్తించు భావకవిత్వపు రోజులవి. స్వర్ణయుగం అన్నారు వాళ్ళు యదార్థయుగం అంటున్నాము మేము [నారాయణబాబు, శ్రీశ్రీ] భావ కవిత్వపు పోకడ జీర్ణం చేసుకొని కొంతవరకు మేమూ రచన సాగించాము. ఆ ఫణితిని రచన సాగించిన దినాలతోకూడా పసిలేకుండా నీరసంగా చేయవలసిన రచన ఇదికాదూ అని మాకు తెలిసికూడా గత్యంతరంలేక కనులకు పొరలుకమ్మితే కావ్య రచనసాగింది అంతట హృదయంలో ఒక విభిన్నమైన వంచలనం. ఉద్వేగం, ఓజస్సు, బలం హఠాత్తుగా ఆరోగ్యాన్నిచ్చాయి. అంతవరకుభావకవులతోపాటు మేముకూడా జీవిత గ్రీష్మాన్ని దర్శించేందుకు మనోనేత్రాన్ని తగిలించిన 'గాగుల్స్'నేల విసిరికొడుదుంకదా! హృదయంలోపొగలూ, సెగలూ రేగి వీధికాలువనీటిలో బురదలో ఆపసోపాలు పడిపోతున్న శ్వనాథుడు, ఊరిబైట పొలంలో ఇనకిరణాలు. శౌర్యంతో కాయక్లేశపడుతున్న సేద్యగాని శరీరంమీదపండిస్తున్న ఘర్మమౌక్తికాలతో ఒక తాజమహల్ కట్టాలని బుద్ధిపుట్టింది. నూ కవిత్వంలో ఉండకూడని వస్తువు, వాడకూడని భాషానేరేలేదు చాకలాడు, సంతటయులు, కుక్క, గాడిద, కుళ్ళుకాలువ, పేట్టరీకూత, మరఫిరంగి, మందుగుండు, బీదవాడు, భిక్షువర్షీయసి అన్నీ – అవేమిటి ఇవేమిటి లోకంలో ఉన్నవన్నీ ! పలాయనత్వం పనికిరాదు, నల్లమందునిషా పనికిరాదు. జీవితం ఎంత సహారా ఎడారిఐనా మేముమాత్రం మరి ఉష్ట్రపక్షులమై సంచరించలేము, యదార్థంగా జీవితాన్ని దర్శిస్తాము. జీవితంమాలిన్యభూయిష్టం అనివప్పుకుంటాము. వేలెత్తి చూపిస్తాము. జీవితంలో మాలిన్యాన్ని గాలించి క్షాళితం చేస్తాము వేదాంతాన్ని జీవితాన్ని ప్రకృతిని అవగాహన చేసుకున్నారు మేము లోకాన్ని. జీవితాన్ని, ప్రకృతినికూడా మారుస్తాము. లోకంఅంతా ఆరోజుల్లో మారచన అశ్లీలమనీ, అపశ్రుతులమయమనీ ఇది ఏదైనా అవుతుంది కాని కవిత్వం మాత్రం కాదనీ వెటకారాలు చేశారు.

నాటినుండి నేటివరకూ వ్యక్తి కవిత్వంకోసం అనేక అవతారాలెత్తేడు. ఎన్నెన్నో మార్గాలు అన్వేషించాడు. ఎన్ని మార్గాలనుండి వెళ్లినాకొసకి మానవాభ్యుదయం, విశ్వశ్రేయ

స్సే కవి కోరుతాడు. ఇప్పటికీ ఎప్పటికీ జాతి పురోగమనానికి సాంఘిక చైతన్యం వాంఛనీయమని ఏకైక మానవకుటుంబంగా వర్ధిల్లి ఈ కాశ్యపిని భూతలస్వర్గం చేసుకొందామని కవికీ సాధారణ మానవునికీ కూడా ఏకైక లక్ష్యం ''

పదం యొక్క శక్తిని గురించి ఇలా చెప్తున్నాడు.

"పదాని కవి ఒక్కడే పటిష్టతతో వాడగలడు. ఇది కవికుండే ఒక ప్రత్యేక విశిష్టత, ప్రావత్తి. కవికి పదం సాక్షాత్కరించినట్లు మరెవ్వరికీ సాక్షాత్కరించదు. సాక్షాత్కరించినా మూలం తెలుసుకోలేరు.

పదాలు పలకలుతీర్చిన స్ఫటికపు రాళ్ళలా ఎన్నెన్నో ముఖాలతో ఎన్నెన్నో జీవితానుభవాలు సాక్షాత్కరింపజేసేగతి భేదపు గర్భగుళ్ళు –

ఒకేరకపు సాంప్రదాయాలూ సంస్కరణ మానవుల దైనందిన జీవితంలో కేవల వాక్యార్థాన్నిచ్చేది ఆత్మానుభవానికి అవగతమై వ్యక్తిగత అర్థగౌరవం స్ఫురింపజేసేవి.

కావ్యకలాపంలో ఛందోబద్ధగజ్జలరవళిలో శ్రుతి తాళ ప్రమాణశ్రీవోపేతాలు. ఈ రకంలో శ్రీశ్రీ ప్రతిభావంతుడు. In Sri Sri the form is every thing

.... .... ....

ఒకకొత్త రకపు మంత్రశక్తి కూడా ఉంటుంది పదాలకి. తిరిగిపోయిన యుగయుగాల కాలచక్ర చంక్రమణపు ఇరుసులతో అర్థంకాని అవ్యవస్థతో మంత్రించిన అక్షతలమాదిరి ఏదో శక్తి వచ్చి తాకుతుంది మనని. ఇది భూతాలను పారద్రోలి పంచభూతాలను ప్రజ్వలింపజేయగల మంత్రయుత బీజాక్షర పటిష్ఠాపటిమ చూపించేది.''

.... .... ....

అభ్యుదయ కవులగురించి ఇలా అంటున్నాడు –

"ఈనాడు కవిత అభ్యుదయ పథాలనంటి మానవజాతి పురోగమనంకోసం ఒక మహనీయపథాన్ని పట్టింది. ఇది మానవజాతి అంతటికీ ముక్తినిస్తుంది....

మనదే [ అభ్యుదయ కవులదే ] అంతిమ విజయం : ఇది చరిత్రాత్మకమైన అవసరం. దాన్ని తుపాకీగుళ్ళు మరఫిరంగులు మసిచేసి నుసి చేయలేవు. ఏ కొద్దిమందినో మినహాయిసే మానవజాతి మౌనంగాచేస్తున్న మహాసంకల్పం. అనుల్లంఘనీయం !.... కాలం కన్ను విప్పిననాటినుండి కవులు పరితల్తో రకరకాల సంబంధం పెట్టుకొన్నారు. అతి నవ్య కవిమాట అభిమానపు మూట నీ రక్తంనుంచి ఉద్భవించాడు – నువ్వే !''

ఈ అభ్యుదయ కవితా ఉద్యమంలో తనస్థానంఏమిటో కూడా చెప్పాడు –

''శ్రీశ్రీ, నేనూ, శిష్ట్లా, రుక్మిణీనాథశాస్త్రి మేమంతా వంశపురుషులం మొదటితరం వాళ్ళం''

వీరిలో ఈనాడు శ్రీ శ్రీ తప్ప తక్కినవాళ్ళంతా కీర్తిశేషులే. అయితే ఆరోజుల్లో వారందరూ చేస్తున్నపుడు చేసిన రచనలే శ్రీ శ్రీ రచనల్లో తలమానికాలు అభ్యుదయంలోంచి విప్లవంలోకి పరిణామంచెందిన శ్రీ శ్రీ చెప్పుకోదగిన గొప్ప రచనలేవీ చెయ్యలేదు. సజీవుడై వుంటే నారాయణబాబు విరసంలో చేరేవాడా ? అన్నది చాలా ఆలోచనాత్మకమైన మంచి ప్రశ్న. దీనికి సమాధానం చెప్పేందుకు ప్రయత్నిస్తూ ఎవరైనా వ్యాసం రాయడానికి ప్రయత్నిస్తే బాగుణ్ణు. ఈ పని అతన్ని Out and Out ఎరిగివున్న సన్నిహిత స్నేహితులెవరైనా చెయ్యవలసిన ని.

.... .... —

నారాయణబాబుపై చెప్పుకోదగిన విమర్శనా వ్యాసాలు అంతగా రాలేదు అయితే ఆధునిక తెలుగు వచన కవితా పరిణామాన్ని పరిశీలిస్తూ వ్యాపాలూ, గ్రంథాలు రాసినవారంతా నారాయణబాబును పేర్కొన్నారు. దీన్నిబట్టి ఈశతాబ్ది కవితారంగంలో అతనిది అపరిహార్యమైన పాత్ర అన్నది స్పష్టం.

విమర్శ వ్యాసాలు రాకపోవడానికి ప్రధాన కారణాల్లో అతని రచనలేవీ పుస్తకరూపంలో రాకపోవడం ఒకటే. మరణించిన 10 సం॥ దాటాక 'రుధిరజ్యోతి' పుస్తకరూపంలో వచ్చింది. పట్టుదలతోనూ, చిత్తశుద్ధితోనూ వెదికితే అందులో చేరని కవితలు కొన్ని లభిస్తాయి. [ఈ వ్యాసం చివర అనుబంధంలో అట్టివి మూడు కవితలు ఇస్తున్నాను] అతని కథలొక సంపుటి, నాటికలొక సంపుటి గ్రంథరూపం దాల్చవలసివున్నాయి. ఇవికాక పీఠికలు, వ్యాస్యాలు, ఉత్తరాలు వగైరాది చిల్లర రచనలు మరొక సంపుటి అవుతాయి

అతని సాహిత్యంపై విమర్శవ్యాసాలూ అరా కొరా రానయినా వచ్చాయి కాని అతని జీవిత విశేషాల్ని తెలియజేసే వ్యాసం ఒక్కటిరాలేదు. కురగంటి సీతారామభట్టాచార్యులు, పిల్లలమర్రి వేంకట హనుమంతరావుగారురచించిన-నవ్యాంధ్ర సాహిత్యవీధులు – చతుర్థభాగము లో – శ్రీరంగం నారాయణబాబు కవిత్వంగురించి విశేషాలు ఇక్కడపొందుపరుస్తున్నాను.

''అత్యంతాభినివేశంలో అధివాస్తవిక ధోరణిని (ఇతడే "అధి" అన్నవాడు) రచనలద్వారా, సభాముఖానా ప్రచారం చేసిన అతి నవ్యుడు నారాయణబాబుగారు. ఉత్సాహము, ఉద్రేకమును కొరవడని స్వేచ్ఛాజీవి యితడు. ఉక్తిలోవలెనే వేషంలోను ఇతడొక విలక్షణవ్యక్తి. ఆ గిరజాలజుట్టూ, అచుడేదారీ పైజామా, ఆ ఆటగోటుతనం – అవీ చూస్తే ఇతడొక విచిత్రవ్యక్తి అనిపించి తీరుతాడు. ఈతడుకూడా 'కవితాసమితి' సభ్యుడుగా ఉన్నప్పుడు మొదట్లో భావకవిత్వపు బాటలలో నడిచినవాడేనని తెలుసుకుంటాము. అయితే అందులో నల్లమందుతనమున్నదని గ్రహించి విసర్జించాడా ఆ మార్గాన్ని. 1928-29 నాటికీతడు నవ్యమార్గగామిగానే ఎలాఅగుపిస్తున్నాడో చూడండి. 'వలపు చెలమలు' అనే ఖండకావ్యంలో –

''మనకు సహకారియగుచు మన్మధుడు పెదకి
వాడియలుగుల గాడిత్రవ్వంగ క్రొత్త
చెలమలేర్పడి తేటలౌ జలములూరె
సలలితములైన యీతీపివలపు చెలమ
లందు తేరినయువ్వి శ్రీచందనోప
మానురాగ సుధాగంధిలామల ప్ర
సన్న పావనతోయముల్ సకియ ! యువియు
నిండికిపోవును నీవు గ్రహింపకున్న''

[ఆంధ్రపత్రిక-సంవత్సరాది సంచిక, 1928-29]

తరువాత తర్వాత యీతడు క్రమంగా వాస్తవిక – అధివాస్తవిక–బీభత్స–అభ్యుదయ ధోరణులలో రచనలుసాగిస్తూ

వచ్చినట్లు గమనిస్తాము. అధివాస్తవికమార్గాన ప్రవృత్తి స్థానము గడించే విషయంలో శ్రీశ్రీ, నారాయణబాబులిద్దరూ అహమికలతో నడచినవారనిమాత్రం మరువరాదు. అయితే శ్రీశ్రీకి మంచి ప్రాచుర్యం లభించడంవల్లనూ ఇతని రచనలు బహుళంగా పత్రికలలో ఆ దినాలలో రాకపోవడంవల్లనూ తగినంత ప్రచారమూ ప్రోత్సాహమూ ఇతనికి లభించలేదు''

నారాయణబాబు శ్రీ శ్రీ కి ఎందులోనూ తీసిపోనివాడని ఈ వ్యాసాల్ని బట్టి అర్థమౌతుంది.

''ఈతని రుధిరజ్యోతి ఖండలనుగనకచూస్తే, శ్రీ శ్రీ కి తీసిపోని సహచరి అధివాస్తవికదోరణలోగాని భీభత్సధోరణిలోగాని ఇతడున్నాడని గుర్తింపజేస్తవి.''

ఇది 1950 కి ముందే మొదటి ముద్రణ వెలువడిన పుస్తకంలోనిదని మనం మర్చిపోరాదదు. శ్రీ శ్రీ కి లేని ఉపన్యాసధోరణి ఇతనికున్నదనీ, 'గేయాలను శ్రావ్యంగా పాడి సభలను ముగ్ధులను చేయడంలో ప్రజ్ఞ గడించినవాడని' కూడా ఈ పుస్తకం తెలియజేస్తున్నది

నారాయణబాబు 'కవితా ధోరణులనుగూర్చి వాదించగల తార్కికుడుకూడా'నని చెప్తున్నారీ పుస్తకంలోనే. తన అధివాస్తవిక ధోరణపైన వచ్చిన విమర్శలనెలా ఎదుర్కొన్నాడో చూపేందుకు ఒక వ్యాసంలోని కొన్ని భాగాలు ఉదహరించబడ్డాయి. పూర్తి వ్యాసం లభించని కారణ చేత ప్రస్తుతానికి ఆ భాగాల్లోని కొన్నిటిని నేను ఉదహరిస్తున్నాను :

అతి వాస్తవికత నాస్తికమయిన తిరుగుబాటు అన్నీ శూన్యంలో అఖరుఅవుతాయి. చివరికి అధివాస్తవికతకూడా శూన్యంలోనే అఖరు అవుతుంది" అనిఅంటున్నారు (పాలగుమ్మి పద్మరాజుగారు)

ట్రిస్టాన్ జారా అమలులోకి తెచ్చిన డాడాయిజమ్ వీరు చెప్పిన నాస్తికత్వం సాధించేందుకే పుట్టింది. డాడాయిజమ్ అంటే విధ్వంసం (Negation) అలా ప్రారంభమయి అల్లకల్లోలం గావించడంతోనే, అందులో కొందరు బుద్ధిమంతులు, వారిలో ఆంద్రెబ్రెటన్ ఒకడు, కేవలం విధ్వంసంవల్ల ప్రయోజనం హుళక్కియని విరమించుకొని, డాడాయిజమ్‌కుఎదురు తిరిగి విధ్వంసధ్వంసం (Negation of Negation) క్రింద యీ అధివాస్తవికమతము అవలంబించారు.

అధివాస్తవికత సాహిత్యంలో తెరువబడిన స్వతంత్రవాటం ఫ్రాయిడ్ సిద్ధాంతాలు, మార్క్సు సూత్రాలకలయికలో పుట్టిన క్రమగానం, సాహిత్యంలో ఒకనూతన ప్రక్రియ. మతాలలో అద్వైతమతం ఎట్లాంటిదో, సాహిత్య మతాలలో అధివాస్తవికత అట్లాంటిది. వాస్తవికత నిర్గుణంలాంటిది. బ్రహ్మ పదార్థాన్ని శూన్యమనగలమా ? ఇది శబ్ద బ్రహ్మను అందుకునే ప్రయత్నం. అందుకో లేకపోతే వ్యక్తుల శక్తి కాని ఆశయం లోటు ఎంతమాత్రంకాదు

'అతి వాస్తవికత మనకు కావాలంటే, వెర్రివాళ్ళదగ్గరకు త్రాగిన వాళ్ళదగ్గరకు పోవాలి' అంటున్నారు నిజమే. స్వచ్ఛందమైన అజ్ఞాత మనస్సు విహారం చేస్తుంది. కాని వెర్రివానికి కవికి వ్యత్యాసం ఉందంటేకవికావలసినప్పుడు. వెర్రిని తెచ్చుకొని ఉపయోగం తీరాక, అరికట్టుకోగలడు. వెర్రివాడు అట్లా చేయలేడు ....

పాల్ ఇలార్డు. అధివాస్తవికులకు గురుతుల్యుడు తెలుగు దేశంలో అధివాస్తవికులుకూడా యీయనమతం ప్రయోజనం కలిగినదని నిర్ణయించుకొని స్వీకరించారు. ఈయన పద్యాలు కట్టుబొమ్మలుకావు. పరంజ్యోతికి కీనీడలు. చర్మచక్షువులతో, పరంజ్యోతిని చూడలేము గాబట్టి నీడనుంచి వెలుగుకు అవకాశాలు కలిగించిన మహాకవి.

తెలుగుదేశంలో అధివాస్తవికతపుట్టి ఎంతోకాలంకాలేదు. పుట్టడమే బాలారిష్టాలతో, తెలుగుదేశపుఅధివాస్తవికతయొక్క మూలం అన్యదేశాలయిన ఆధారపక్షాం అన్యదేశాలలోని అధివాస్తవికతకు తెలుగుదేశం అధివాస్తవికతకు ఎన్నో తేడాలున్నాయి. ఏ నవీనమైన సిద్ధాంతమైనా ప్రవేశపెట్టేటప్పుడు, దేశకాలపాత్రాలననుసరించి ప్రవేశపెట్టాలి కాబట్టి. లేకపోతే మొక్క మొలవదు

వాస్తవికత ఛాయాచిత్రంలాంటిదైతే, అధివాస్తవికత X'ray ఛాయా చిత్రం లాంటిది"

– ఆంధ్రపత్రిక 24-12-1944.

ఈ గ్రంథరచయితలీ పరిశీలనతరవాత నారాయణబాబు అధివాస్తవిక ధోరణిని విసర్జించి తర్వాతకాలంలో "అభ్యుదయ మార్గగామి'' అయ్యాడని చెప్పారు. ఇదంతా 1950కి ముందేనని మరోసారి గుర్తు చేస్తున్నాను.

సేకరించగలిగినన్ని జీవిత విశేషాల్ని, కవితా లక్షణాల్ని ఈ వ్యాసంలో వివరించే కృషి చేశాను. ఇది భావిలో నారాయణబాబుపై జరగబోయే సమగ్రపరిశోధనకు నాందివంటిది మాత్రమే కాకతీయ విశ్వవిద్యాలయంలో గుడిహాళం రఘునాథంగారు నారాయణబాబుపై Phd చేస్తున్నారట.

అవంత్స సోమసుందర్ ఆంధ్రప్రభ. స్రవంతి, విశాలాంధ్ర, ప్రగతి వగైరాద పత్రికల్లో నారాయణబాబు కవితపై కొన్ని వ్యాసాల్ని ప్రచురించారు. వాటి వివరాలు యివీ :

1) రుధిరజ్యోతి కాంతిలో విప్లవఋషి కన్నీళ్ళు
– ఆంధ్రప్రభ, 27-3-72
2) రుధిరజ్యోతి వెలిగించిన విప్లవకవితా వైభవం
– విశాలాంధ్ర, 27-2-72
3) దళితవర్గాల విప్లవచైతన్యం-నారాయణబాబు కవితాకంఠం
– ప్రగతి. 9-4-72
4) కపాలమోక్షం – ఒక సంవీక్షణం – ప్రగతి. 13-4-72
5) రుధిరజ్యోతిర్దర్శనం – స్రవంతి, మే, జూన్, జూలై 73
6) నారాయణబాబు కవితా సంగీతం
7) కిటికీలో దీపం, నారాయణీయం.

ఇవి త్వరలోనే గ్రంథరూపందాలుస్తాయని ఆశిస్తాను.

అతి చిన్నదే అయినా "ఆధునిక కవిత్వంపై నారాయణబాబు అభిప్రాయాలు" అనేవ్యాసం ప్రకటించారు, టి.ఎల్. కాంతారావుగారు [భారతి – మె 1979, పేజీలు 38-22]. ఇందులో వీరు –

"వ్యక్తినిష్ఠమైన ఆధునిక కవితాలక్షణం సామాజిక నిష్ఠం కావడం శ్రీశ్రీ నారాయణబాబులతోనే ప్రారంభమైంది"

అంటూ ప్రారంభించి –

''భావకవులు తీసుకువచ్చింది కవిత్వంలో తిరుగుబాటే అయినా ఆ తిరుగుబాటుకు సమాజంతోగాని, దానిలోవున్న

మంచి చెడులతోగాని, సామాన్యుని జీవితంతోగానిపొత్తులేదు. అది కోరేది వ్యక్తిస్వేచ్ఛ, వ్యక్తియొక్క విశృంఖల ప్రవృత్తి, మాత్రమే. ఆ ప్రభావంలో కొంతకాలంవున్నా, తత్ప్రభావం లోంచి బయటపడి కవిత్వంలో ఆశించే స్వేచ్ఛ సర్వమానవ స్వేచ్ఛ కావాలని, తిరుగుబాటు సమాజపరమయిన తిరుగుబాటు కావాలనీ, సమాజంలోని చెడును తొలగించి దానిస్థానే మంచిని ప్రతిష్ఠించాలని నారాయణబాబు ఆదిగాగల కవులు వాంఛించారు నారాయణబాబు కాలంనాటికి 'నిబద్ధత'' అనేది ఈనాడున్నంత తీవ్రంగ లేదు. అయినా నారాయణబాబును గురించి చెప్పేటప్పుడు అతను ఆనాటికీ, ఈనాటికీ అభ్యుదయ దృక్పథంగల నిబద్ధకవి అనే చెప్పాలి."

అని వివరించి –

"కవిత్వంగాని, సాహిత్యాది ఇతర కళలుగ్గాని వాటంతటవిగా సమాజంలో విప్లవాలను, తిరుగుబాట్లను లేవదీయలేకపోయినా సమాజంలో ఒకభావ విప్లవం సాధించడానికి మహోపకరణాలుగా యూపక్షు సాహిత్యకారులు భావించడం యథార్థం. రేపు రాబోయే సామాజిక విప్లవానికి ఈనాటి కవిత్వ పునాది కావాలి. అదే పురోగమనమార్గం. ఆమార్గంలో పయనించినఅభ్యుదయకవి నారాయణబాబు. నారాయణబాబు నిన్నటి, ఈనాటి కవి కాదు, మానవాభ్యుదయంకోసం తన కలాన్ని కత్తిగా ఝుళిపించిన ప్రగతివాది కవి."

అని స్పష్టంగా తేల్చి చెప్పారు.

ఇటీవలే రోణంకివారు ప్రచురించిన "నేనెరిగిన నారాయణబాబు'' అనే వ్యాసంలో నారాయణబాబు వ్యక్తిత్వాన్ని సంబంధించిన అంశాలు కొన్ని తెలుస్తున్నాయి.

శ్రీరంగం నారాయణరావుగారు 14 ఆమధ్య ఆంధ్రజ్యోతిలో నారాయణబాబుపై చిన్ని వ్యాసం ప్రచురించారు వారే ఇటీవల "ఆర్షసాహితి'' అనే విజయనగరంనుంచి వెలువడే పక్ష పత్రికలో మరో చిన్ని వ్యాసం రాశారు. 15

నేనే ఇటీవల సౌజన్య [వారపత్రిక] 13 లో "శ్రీరంగం నారాయణబాబు : ఒక పలకరింపు" అన్న వ్యాసం ప్రచురించాను. విశాఖపట్నంలో అక్టోబర్ మొదటివారంలో జరిగిన రెండవ ప్రాచ్యభాషా సదస్సులో 14 నారాయణబాబుపై ఒక వ్యాసం చదివాను. వారు ప్రచురిస్తున్న ప్రత్యేక సంచికలో అది త్వరలోనే ముద్రితం కామన్నది.

ఆంధ్రజ్యోతి దిన పత్రికలో [తేదీతెలీదు] నాగభైరవ కోటేశ్వరరావుగారు దేశమాత వగైరా కవితలపై వ్యాసం ప్రచురించారు శ్రీ సంపత్ ఆంధ్ర భాషా సర్వస్వం-లో ఆధునిక కవితగురించి రాసూ 1943 ప్రాంతాలలోనే నారాయణబాబుపై విపులీకరణ చేశారు.

1954లో విశాలాంధ్ర ప్రచురణాలయంవారు ప్రకటించిన ఆంధ్రదర్శినిలో నారాయణబాబుగురించి. అవసరాల సూర్యారావుగారు రాసినవాంట్లో నారాయణబాబు మిణుగురులు అనే భావకవితా రచన చేశాడనీ, విజయనగర రచయితల సంఘాధ్యక్షుడనీ, సంపంగితోట [ఛకోవ్ నాటకానువాదం] ఇతని రచనేననీ వున్నది.

మహతి [యువభారతి, ప్రచురణ, 1976]లో ఆరుద్ర ఇలా రాస్తున్నాడు.

"అజంతా ఒకరకంగా నారాయణబాబు లాంటివాడు తన తరంలోని మిగతా కవులందరూ శ్రీశ్రీలోని శబ్దచిత్రాలకు ఎగబడితే అజంతా ఒక్కడే నారాయణబాబులోని శబ్దచిత్రాలకు వారసత్వాన్ని మౌనంగా ప్రకటించుకున్నాడు''

ఈ అంశం ఇంకా లోతుగా పరిశీలించవలసివుంది.

1945లో జరిగినదికాక మరో రెండు సన్మానాలు జరిగినట్టు సోమసుందర్ రాసున్నారు.

1952లో సామర్లకోటలో కాటూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతను సన్మానం జరిగింది. వేదుల సత్యనారాయణశాస్త్రి, అధ్యక్షులు. తొలిపలుకులలో నారాయణబాబునీ, అతని కవిత్వాన్ని అవమానదరుస్తూ ఉపన్యసిస్తే తర్వాత ఉపన్యసించిన సోమసుందర్, రాంషా, కాటూరి. వేదులవార్లను విపరీత ఉద్రేకంతో ఖండించి. నారాయణబాబునీ. ఆధునిక కవితనీ ప్రతిష్ఠించారు. చివరికి కాటూరి, వేదుల తగ్గిపోయారు.

మరొక సన్మానం శశాంక వివాహ లో 1954 ఏప్రిల్ 24వ తేదీని అనులాపురందగ్గిర రాజవరంలో జరిగింది. శశాంక వివాహానికి నారాయణబాబు పౌరోహిత్యంవహించాడు శశాంక తనకావ్యంనయాజమానాను సోమసుందర్‌కిఅంకితంఇచ్చాడు. ఆ సభలోకూడా కాటూరి, వేదులావుండీ వెనుకటి ధోరణిలోనే నారాయణబాబును చిన్నపరుస్తూ మాట్లాడారు. ఈసారి శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు వారినిఖండించారు రాంషా తన సహజగంభీర ధోరణిలో ఉపన్యసించి ఆధునిక కవిత్వాన్ని బలపరిచాడు.

నాకు తెలిసినంతలో స్థూలంగా – నారాయణబాబుపై వచ్చిన విమర్శనా సాహిత్యం ఇదే. ఇంకావుంటే విజ్ఞులు తెలియపరిస్తే సంతోషిస్తాను. నారాయణబాబునుగురించి ఈవ్యాసంలో చెప్పబడని విశేషాలు ఎవరైనా తెలియపరిస్తే వారికి నా ఆహ్వానం.

ఇంకా నారాయణబాబు సాహిత్య వ్యక్తిత్వానికి సంబంధించిన అనేక కోణాల్లో పరిశీలన చెయ్యవలసివుంది. ఈపనికి పురిపండా, శ్రీశ్రీ, రోణంకి, చాసో, కాళూరి వగైరాది పెద్దలు పూనుకుంటే అ పరిశీలనకు న్యాయం చేకూరుతుంది. పనిలో పనిగా పూడిపెద్ది వెంకటరమణయ్యగారికి సంబంధించిన వివరాలతోకూడా మంచి వ్యాసాలు రావలసివుంది. ఇదంతా జరిగినపుడు బాగా వెలుతురు ప్రసరించని ఒక కోణంపై మరింత వెలుతురు ప్రసరించినట్టవుతుంది.

వివరణలు :

1. నవ్యాంధ్ర సాహిత్యంలో గవేషణ – ఆచార్య రోణంకి అప్పలస్వామి - ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక
2. సంఘర్షణ – రెంటాలగోపాలకృష్ణ కావ్యం– 1950
3. నారాయణబాబు – కొన్ని జ్ఞాపకాలు – పురిపండా అప్పలస్వామి – కృష్ణాజిల్లా రచయితల తృతీయ మహాసభ – ప్రత్యేక సంచిక - గుడివాడ - 1970జూన్ (16_18పేజీలు)
4. కాళూరిని నారాయణబాబు దొర అనేవాడని పురిపండా వారు చెబుతున్నారు.

5. ఈరోజుల్లోనే మాలా వెంకుమాంబ అనే ఒక కాంగ్రెసు వాది కూతురుతో నారాయణబాబుకు సంబంధం వుండేదట ఆవిడ కూడా డాక్టరు, చచ్చిపోయింది. దాంతో నారాయణ బాబుకు మతి భ్రమించినంత పనయిందట. ఇది వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశమే అయినా ఇందులో నిజా నిజాలు ఇంకా పరిశీలించవలసివుంది. పురిపండావారు తమ వ్యాసంలో రాసిన బాల్యవితంతువు వెంకుమాంబకూతురు ఒక రవునో కాదో కూడా పరిశీలించాలి: నారాయణబాబు రాసిన "మల్లమదేవి కూతురు" అనే నాటికలో వెంకుమాంబ పాత్ర వుంది. అమె దాది.

6) డా॥ కొత్తపల్లి వీరభద్రరావుగారు ప్రస్తుతం హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఆంధ్రశాఖలో ఆచార్యులుగా వుంటున్నారు.

7) చాగంటి గోపాలకృష్ణమూర్తిగారు. చాగంటి శేషయ్యగారి కొమాళ్ళు ప్రస్తుతం శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాలలో తెలుగు శాఖాధిపతిగా వుంటున్నారు.

8) నేనెరిగిన నారాయణబాబు – ఆచార్య రోణంకి అప్పల స్వామి – ఆంధ్రజ్యోతి – దినపత్రిక – 1-10-1979.

9] అంట్యాకుల పైడిరాజుగారు ప్రసిద్ధ చిత్రకారులు, విజయనగరంలో School of Arts &Crafts స్థాపించారు ఆంధ్రవిశ్వవిద్యాలయంలోని చిత్రకళావిభాగంలోఅధ్యాపకులుగా పనిచేసి ఇటీవలనే రిటరయ్యారు.

10) ఈ విషయాన్ని రోణంకివారికంటేముందే "నవ్యాంధ్ర సాహిత్య వీధులు" చతుర్థ భాగములో కురుగంటి సీతారామ భట్టాచార్యులు, పిల్లలమర్రి వేంకట హనుమంతరావుగార్లు రాశారు. ఈ గ్రంథం 1951లో రెండవముద్రణకూడాపొందింది. [చూ॥ రెండవ ముద్రణ – పేజీలు 739-744] ఈ విషయాన్నే దువ్వూరి రామిరెడ్డిగారుకూడా రాస్తున్నారు. [చూ॥ కవికోకిల గ్రంథమాల – 5, 1959]

11) విశాఖపట్నమ్ – మానేపల్లి రచించిన నగరకావ్యమ్ – బుక్స్ అండ్ బుక్స్ ప్రచురణ [1974]

12] ఆంధ్రప్రదేశ్‌దర్శిని-విశాలాంధ్ర ప్రచురణ (1976) "అభ్యుదయ సాహిత్యం" అనే వ్యాసంలో శ్రీరంగం నారాయణబాబు గురించి విపులంగాచర్చించారు [పేజీలు 873-79] తుమ్మల వెంకటరామయ్యగారు.

13] తెలుగు కావ్యమాల – కాటూరి వేంకటేశ్వరరావు – సాహిత్య అకాడెమీ. న్యూఢిల్లీ ప్రథమ ముద్రణ : 1959. [1976లో పునర్ముద్రణ పొందింది] చూ॥ పేజీలు 305. 6-369.

14] శ్రీరంగం నారాయణరావుగారు ప్రస్తుతం విజయనగరంలో ఆంధ్రపత్రిక విలేఖరిగావుంటున్నారు వీరు విజయనగరం జిల్లా ఏర్పడిన సందర్భంగా ఆంధ్రజ్యోతి 1-6-79 న ప్రచురించిన ప్రత్యేకానుబంధంలో ఒక వ్యాసంరాస్తూ నారాయణబాబుగురించి రాశారు. ఇందులో ఆయన నారాయణ బాబు -నారాయణబాంబుగా ప్రసిద్ధికెక్కాడన్న కొత్త విషయం రాస్తున్నారు. ఆర్షసాహితి-[పక్షపత్రిక – విజయనగరం-2] 15-10-79 సంచికలో 5, 6. పేజీలో శ్రీరంగం నారాయణ బాబుపై శ్రీరంగం నారాయణరావుగారు రాసిన చిన్న వ్యాసం లోని విశేషాలు :

నారాయణబాబు సుందరనారాయణగారి ద్వితీయపుత్రుడు. పశువైద్యం చదవడానికి మద్రాసువెళ్ళి – విద్యకు స్వస్తిచెప్పి ప్రబంధకవిగా మారి [?] స్వగ్రామం చేరుకున్నాడు. సంగీత రత్నాకరుడు ద్వారం వెంకటస్వామిగార్కి భావనారాయణరావు దత్తపుత్రుడైతే నారాయణబాబు అభిమాన పుత్రుడు. నాయుడుగారింట్లో ఒక కుటుంబ సభ్యునిగా మెలగేవాడు .... సంగీత పోటీలలో న్యాయనిర్ణేతగా వివిధ కార్యక్రమాలకు సలహాదారునిగా వ్యవహరించేవాడు .... ఎప్పుడు అందంగా ఆనందంగా సాంఘిక నాటకంలో కథానాయకుడిలాగ కనిపించేవాడు. అతనిలో వయస్సు ప్రభావం గోచరించేదికాదు.

15) Second AndhraPradesh Oriental conference :- ఆంధ్ర విశ్వవిద్యాలయం, వాల్తేరులో 1973 అక్టోబర్ 5, 6. 7 తేదీలలో జరిగింది. ఆ సందర్భంగా ఏర్పడిన Seminars లో 6-10-79 తేదీన శ్రీరంగం నారాయణ బాబుపై నేను వ్యాసం చదివాను. ఆ Seminarకు కొత్తపల్లి వీరభద్రరావుగారు అధ్యక్షులు. పురిపండా, బెజవాడ గోపాల రెడ్డి, లత వంటి ప్రముఖులుకూడా ఆ Siminar కు హాజరయ్యారు.

16] సౌజన్య. వారపత్రిక, విజయవాడ-2, 13-10-78.

---

# ఇటీవల వెలువడిన కొత్త పుస్తకాలు

సమాంతా నువ్వెక్కడ ?
ప్రచురణ : 21st century Writers, Vizianagram-531202, క్రౌన్ 119 పేజీలు, 5 రూ॥

ఇందులో మహీధర రామమోహనరావు. మంధా వెంకట రమణారావు, కె. వి. రమణారెడ్డి, అల్లం రాజయ్య, జ్వాలాముఖి. నిష్టల వెంకటరావుగార్ల 12 వ్యాసాలున్నాయి.

కొమ్మలు చీల్చుకుని వస్తున్న పూలు
కవి సేన కవితా సంకలనమ్

ప్రచురణ : కవిసేన, ఘోషామహల్. హైదరాబాద్-12
క్రౌన్ 100 పేజీలు రూ 2-50

ఇందులో శేషేంద్ర, రామచంద్రమౌళి, అకొండి వెంకటరత్నం, సౌంధ్రశ్రీ, డా॥ తంగిరాల ప్రకృతుల కవితలున్నాయి. సామాజిక ప్రయోజనం గురించి ఆలోచించడం మానేసి, అనుభూతి ప్రథానంగా గ్రహిస్తే కొన్ని మంచి కవితలే వున్నాయిందులో. ఈ కవిసేన ముందుముందు ఏం సాధించమందో చూడాలి. – సింగిశెట్టి సంజీవరావు.

---

# అవగాహన - 3

శ్రీ శ్రీ సాహిత్య సమాలోచన సంపుటిగా 1980, మార్చి 1 వ తేదీకే వెలువడుతుంది. రచనలు పంపేవారు జనవరి 15 '80 లోగా పంపాలి. రచనలు పంపవలసిన చిరునామా :

మానేపల్లి సత్యనారాయణ, ఎడిటర్ "అవగాహన"
C/o బుక్స్ అండ్ బుక్స్, బొండాడవీధి, విజయనగరం-531 201

అనుబంధం

# రుధిర జ్యోతిలో చేరని నారాయణబాబు కవితలు

## ధర్మక్షేత్రము

నారాయణుడే
నరునకు
సారథి అయినాడు
పృథ్విని పాలిస్తూ
తారల నాడిస్తూ
నారాయణ చక్రము
నదిలో నాదములాగను
"ఓం, ఓం" అన్నాది
రణరంగములో
ప్రణవగానము
గాంభీర్యముగా
గర్జన చేస్తూ
పాంచజన్యము
"హారోం, హారో!"
అన్నాది
గాండీవ ధనుష్టం
కారము
ఝుంకారముతో
"హ్రాం, హ్రోం"
"భ్రాం, భ్రోం!"
అన్నాయి.
కదనభూమి
కల్లోలములో
మార్గణాది
మారణాస్త్ర పాత
వికలాంగ వీరుల
వీరాలాపములూ
విగత ప్రాణులూ
విభుల్లపై బడి
వెర్రెత్తిన
యువిదల
యుద్ధాంతర
హృదయ దళన
రోదనార్తులు
విహాయసానికి ముత్తముగా
"దబదరో, దబదబోం!
హాహోం, హాహోం"
సోహం, సోహం
అన్నాది
నర విముక్త విష,నిశిత
నారాచములు
నారిని వీడి
రోలంబ నినాదములా
గోవర్ధన మెత్తి
గో, గోపిక గణమును
గాచిన
నారాయణుడే నరునకు
సారథి అయినాడు.

ఇది భారతి [వృష, జ్యేష్ఠ] 1941 జూన్ సంచికలో అచ్చయింది. నారాయణబాబు కవితలు కొన్ని వేర్వేరు శీర్షికలతో రూపాలతో వేర్వేరు పత్రికలలో పడటం జరిగింది. ఇదికూడా మరేదయినా పేరుతో మరో పత్రికలో వచ్చిందేమో చూడవలసి వుంది.

## ప్రణయ మల్లిక

కందళిత సర్వసౌందర్య కందమైన
విశ్వమను విరితోట, నవవికాస
లోహమునంగు సుఖపు కాలువలకోన
కెరలు పాలకపిలి క్రొత్తనునుగ మెఱుగు
జిల్గు కెరటాలఁ బోలు సుస్నిగ్ధ నవ్య
భావదళధాళధళ్య సంపదలు పొలయ,
సరళ యౌవ్వన కౌముదీచ్ఛాయలందు,
జీవ వీచికలవల్లరి చివరికొమ్మ,
జీబుకొను హృదయవసంగాలి చివురు గుబురు
లోన కమ్మగా వికసించినాను; విమల
ప్రణయ మల్లికాబాలికామణిని నేను.
నాయతుల మాధురీవర్ణనల నిరతము
పాడుమండెడు బంభర బాలకవుల
మంజు మానస నీరజ మందిరాలె
యిచ్చె మెయిహాయినే విహరించువిడిదె
లలితగోత్సాహ చకితాంతరాత్ములగుమ
నాయుభింప నిర్మల వాసనా కంధాంక
గేయమాలికలను నలుకెలకులందు
వల్లి వేఁకొనెడు మందవాయుపోత
గాయక శిఖామణి శ్రావ్యకంఠగళిత
గానలహరీ తరంగ సంఘాలునాకు
ఖేలనములు నెయ్యంపుటుయ్యాల బాల్లు;
కళలఁగొలకు నీయుద్యానతల మవెల్ల
నాకు తేనెల తీపిగానముల వలన
నాదు వలపుల కమ్మగానముల వలన
ఎల్లపుడు నెలుకొల్చి ధ్వనించుచుండు
శ్రవణ సుఖమున పారవశ్యంబు నొందు
అకలు పామ్లాన నిత్య మల్లికను నేను.

ఇది మొదటిసారిగా 1928 ఆగస్టులో వెలువడిన కవితాసమితి వార్షిక సంచిలో విశాఖపట్నం నుంచి ప్రచురించబడినది.

## రంగమెళితేనేటి ?

కాటూరి వెంకటేశ్వరరావుగారు సంకలనంచేసిన తెలుగు కావ్యమాల [1959] లో శ్రీరంగం నారాయణబాబు కవితల్లోగడ్డిపరకతో పాటు ఇదికూడా చేర్చబడింది.

రంగమెళితేనేటి రంగ్గనపోఁట! నే
రంగమెళితేనేటి?
అచ్చరాలవేర పచ్చ పొడుసుకొన్నాను
పాటుమాటుగరాన్ని సదివించుకొన్నాను
రంగమెళితేనేటి?
రయికమీన నీపేరె రాసించుకున్నాను
కొంగోర నేదాన్ని కూడబలుక్కున్నాను
రంగమెళితేనేటి?
ముంగిల్లో నీపేరె ముగ్గెట్టుకున్నాను
కళ్లన్ని యెట్టిదాన్ని కసుక్కొన్నాను
రంగమెళితేనేటి రంగ్గనపోఁట !

# శ్రీరంగం నారాయణబాబు గురించి అదనపు భోగట్టా

అవగాహన–2లో నారాయణబాబు గురించి అందినంత ఎక్కువ సమాచారంతో నేను ప్రచురించిన సుదీర్ఘ వ్యాసానికి, అభినందిస్తూ దేశంలో అనేక ప్రాంతాలలోవున్న సాహితీ పరులనుంచి ఉత్తరాలందాయి. అతన్ని తెలుగుదేశం దాదాపు మర్చిపోతున్న దశలో ఈ వ్యాస ప్రచురణ ఎంతయినా సమంజసంగా వుందంటూ స్రవంతి అభిప్రాయ పడింది. అందరికీ కృతజ్ఞతలు.

క్షమాపణలతో ఒక సవరణ మనవి చేస్తాను. రుధిరజ్యోతిలో చేరని నారాయణబాబు కవితగా ధర్మక్షేత్రము ప్రచురించడం జరిగింది. ఇది చాసోగారి అచ్చయిన తొలి కవిత. ఈ పొరపాటుకు క్షంతవ్యుణ్ని. సోమసుందర్, కె.వి. రమణారెడ్డి, కనక్ ప్రవాసి వంటిమిత్రులందించినసమాచారం ఆధారంగా [వారికి కృతజ్ఞతలతో] అదనపు భోగట్టా యిస్తున్నాను

1. నారాయణబాబు బ్రతికివుంటే విరసంలో చేరివుండేవాడా? అనే ప్రశ్నకు సమాధానం.
ప్రజాతంత్ర రచయితల ప్రకటన 1954లో ఆంధ్రపత్రిక ప్రేరణతో కమ్యూనిస్టువ్యతిరేక సందోహంసంరంభించినపుడు పాలగుమ్మి పద్మరాజుతో కలిసి, నారాయణబాబు కన్వీనర్ కావడం అతని జీవితంలో చెరగని మరక. అనిసెట్టి సుబ్బారావు అరెస్టు సందర్భంలో అతని పాత్ర హేయమైనది. అనేక అరసం సమావేశాల్లో ప్రసంగించివుండ వచ్చునుగాని అతని రాజకీయాభిప్రాయాలు పిరికిగా వుండేవి.

2. శ్రీ శ్రీకి ఈ నాడు నారాయణబాబుపై వ్యతిరేకత ఉన్నట్టులేదు. ఇటీవల [80 తొలి నెలల్లో] స్వాతిలో వస్తుండిన "అనంతం'' వ్యాసాల్లో నారాయణబాబు రచించిన విశాఖపట్నం కవితని ఎంతగానో మెచ్చుకున్నాడు. అనంతంలో మరికొన్ని సందర్భాలలో అతని గురించి "మంచిగానే' రాశాడు. అనిశ్చిత రాజకీయ అభిప్రాయాల్లో శ్రీశ్రీ, నారాయణబాబూ దొందుకు దొందే.

3. నారాయణబాబు ప్రచురించిన మరో రెండు కథల ఆచూకీ దొరికింది. మానసపుత్రులు–రూపవాణి 1947 జనవరి పాత్ర విపత్తు–భారతి, ఫిబ్రవరి 1942, పే॥ 173–78

4. నారాయణబాబు చనిపోయిన నెలలో (అక్టోబరు1961) వచ్చిన చేతన (విజయవాడ–మాసపత్రిక)లో సూములకంటి వెంకటప్పయ్యగారు నారాయణబాబుకు నా జాబు అనేఎలిజీ రాశారు. వెనుకటి ఆంధ్రజ్యోతి [తెనాలి–మాసపత్రిక]లో సోమసుందర్ లలూన్ నెగర్డ్ ఓ కూరకూ [నా. బా పై] అనే కవిత ప్రచురించారు. ఇటీవలఅతని కవితా వైశిష్ట్యాన్ని వివరిస్తూ సోమసుందర్ వ్యాసాలు ప్రచురిస్తున్నారు అవి గ్రంథ రూపంలో రావాలని వాంఛిస్తున్నాను

5. తూ.గో. జిల్లా ఆలమూరులోని తరుణ సాహితి అనే సాహిత్య సంస్థ భువన విజయాన్ని ఆధునిక పద్ధతిలో నిర్వహించేది (1954లో తొలి ప్రదర్శన) అందులో శ్రీశ్రీ, నారాయణబాబు వగైరాదులు పాల్గొన్నారు.

6. నారాయణబాబు అముద్రిత/అసంకలిత రచనలుకొన్ని తమ వద్దవున్నట్టు చాసో, కె.వి. రమణారెడ్డి ఆరుద్ర తెలియ జేస్తున్నారు లేఖలుకూడా వుండివుంటాయి. పెద్దలు మిత్రులు సహకరించి అవినాకు పంపిస్తే–లేదాతామే ప్రచురిస్తే నారాయణబాబు సమగ్ర వ్యక్తిత్వం అంచనా వేయవచ్చును. అతనిపైవుండే అభిమానం అతని లోపాల్ని కప్పిపుచ్చి తప్పు అంచనా వేసేదిగా ఉండకూడదు. ప్రతి వ్యక్తిలోనూ ఉండే వైరుధ్యాల్ని పూర్తిగా అర్థం చేసుకున్నప్పుడే సాహిత్య పరిణామంలో అతనిపాత్రస్పష్ట మౌతుంది.

–మా॥స.

---

# సృజన

తెలంగాణాకు చెందిన అయిదుగురు సాహితీ మిత్రులు కలసి కాళోజీ వంటి పెద్దమనిషి అండగా – తిలక్ సంస్మరణ సంచికగా సృజన తొలిసంచికను 1966 నవంబరులో వెలువరించారు. మరో పదిమంది మిత్రుల ప్రోత్సాహం ఆర్థికంగానూ, హార్దికంగానూ లభించగా త్రైమాసికగా మును సాగింది. ఆనాటి 'నవత' ను బాహ్యంగా పోలినా హృదయగతంగా సృజన కొత్తదారి తొక్కింది. బుచ్చిబాబు సంచిక (67నవంబర్) చలం సంచిక (68 మే) కథల సంచిక (13) శ్రీ శ్రీ సమాలోచన సంచిక (70 ఫిబ్రవరి, సంచిక 14) ఇత్యాదిగా తెలుగుసాహిత్యంలో చిరస్మరణీయాలైన సాహితీ రూపాల్ని వెలువరించింది. నాలుగేళ్ళపాటు త్రైమాసికగా పదహారు సంచికలు అవిచ్ఛిన్నంగా వెలువరించి ఆధునిక సాహిత్యవేదికను రూపొందించింది, దీనికి కొంచెం తరువాత ప్రారంభమైన సంవేదన, కళాకేళి వేకువ మొదలైన పత్రికలకూ తెలుగు దేశపు మేధావుల్లో మంచిగుర్తింపునే పొందేయి గాని నిర్వహణలో ఎదురయ్యే చిక్కులు, ఆర్థికమాంద్యం వగైరాకారణాలవల్ల ముందుకు సాగ లేకపోయాయి' ఈ పత్రికలు చివరి 60 లలో ఎందరో యువరచయితల్ని 'వార పత్రికలనుంచికాపాడిఆలోచనామార్గంలోనడిపించాయి

70 జూలైలో విరసం ఆవిర్భవించినపుడు సృజన ప్రత్యేక సంచిక వెలువరించింది, అంతవరకూ సాహిత్య సమాలోచనలు చేసిన సృజన 'ఇంటా బయటా' వున్న రాజకీయాలను, ప్రజా ఉద్యమాలనూ బహిరంగంగా చర్చిస్తూ ఒక మిలిటెంట్ పత్రి

(తరువాయి 35వ పేజీలో)

---

## ముఖ్య సవరణ

12వపేజీ రెండవ కాలం మూడవవాక్యం నుండి ప్రారంభం అయిన కుటుంబరావుగారి జవాబు ఇలా సవరించి చదువుకోవాలి.

జవాబు: మీ ప్రశ్నకు నేను ఎలా సమాధానం చెప్పగలను? మీ అనుభవాన్ని మీరే విశ్లేషించుకోవాలి. ఏ నాడో కాలేజీలో చదివిన shakespeare నిజంగా అంత గొప్పగా రాశాడా అని 30 ఏళ్ల తరువాత మళ్లీ చదివితే ఇంకా గొప్పగా రాశానట్టనిపించింది. ఇది నా అనుభవం

Source: A.P. Press Academy Website

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/